Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 344 | పేజీలు 8 | వెల : 5 | గురువారం 22 మే 2025

ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY

వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....


మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



## యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

### యోగాకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని మోదీ

అమరావతి: యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఉండవల్లిలో 'యోగాంధ్ర' వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో నిర్వహించుకునే కార్యక్రమం యోగా అన్నారు. ఇది కొద్ది మందికో, కొన్ని ప్రాంతాలకో పరిమితమైంది కాదని.. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరమని పేర్కొన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగం కావాలన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కావాలంటే దీన్ని సాధన చేయాలని సూచించారు."ఫొటోలు, ఈవెంట్ కోసం ఒకరోజు చేసే కార్యక్రమం కాదిది. ప్రతిఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమమిది. జీవనశైలిలో భాగమయ్యేలా యోగాను ముందుకు తీసుకెళ్లాలి. నేటి నుంచి నెలపాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తున్నాం. కనీసం 2 కోట్ల మందికి తక్కువ కాకుండా పాల్గొనాలన్నది సంకల్పం. కనీసం 10 లక్షల మందికిపైగా యోగా సర్టిఫికెట్లు ఇవ్వాలనేది లక్ష్యం. జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు కార్యక్రమం చేపడతాం. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిద్దాం. విశాఖలో జరిగే యోగా ఈవెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారు. పాఠశాలల్లోనూ ఇక నుంచి రోజూ ఒక గంట యోగా ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు.

# పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో విఫలం

### ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ
### రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సిఎం రేవంత్



హైదరాబాద్: మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గాం దాడి తర్వాత దేశం అంతా ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని.. కానీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా మోదీ ప్రభుత్వం వెనకడుగు వేసిందని.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని విమర్శించారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు. 18 ఏండ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని.. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని అన్నారు. 1971 పాకిస్తాన్ పై ఇందిరా గాంధీ యుద్ధం చేసి బలమైన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. పాక్ ను రెండు ముక్కలు చేసి శాశ్వత గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్ పై తీవ్ర వాద ముసుగులో దాడి జరిగితే ఇందిరాగాంధీ తెగువ గుర్తు చేసుకొస్తుందని అన్నారు. దాదాపు 54 ఏండ్ల తర్వాత కూడా ఉక్కు మహిళ తెగువను ప్రపంచం గుర్తు చేసుకుంటుందని అన్నారు. తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ కేంద్రానికి అండగా నిలిచామని.. క్యాండిల్ ర్యాలీతో తెలంగాణలో కేంద్రానికి మద్ధతుగా ర్యాలీ చేశామని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా కంగ్రెస్ తో పాటు ప్రజలందరూ అండగా ఉన్నప్పటికీ.. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. పాకిస్తాన్ విషయంలో అమెరికాకు లొంగిపోయి వెనకడుగు వేసిన మోదీ.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచక్షణ కోల్పోయి రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మొట్టమొదట కేంద్రానికి అండగా నలిచింది తెలంణ ప్రభుత్వమని. క్యాండిల్ ర్యాలీ తీసి కేంద్రానికి, బలగాలకు అండగా నిలిచామని అన్నారు. ఆ రోజు తాము చేసిన దానికి అభినందించడానికి నోరు కూడా రాలేదని విమర్శించారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం అసువులు బాసారని, రాజీవ్ విగ్రహంపై సంకుచిత ఆలోచనతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు దేశం అంతా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దేశ ప్రజల హక్కులను, స్వాతంత్య్రాన్ని కాపాడటానికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు.





## తిరుపతి గంగమ్మ జాతర

### సతీమణి భువనేశ్వరితో కలసి సారె సమర్పణ

చిత్తూరు: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించారు. సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో ఆయన పాల్గొన్నారు. సీఎం దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు దంపతులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రానికి మంచి జరగాలని సీఎం ప్రార్థించారు. మరోవైపు అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ దర్శనం కల్పిస్తారు. దీంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఎం రాకతో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



## తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్

మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

అగ్రనేత,పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హతం

ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా

వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం

గణపతి తరవాత బాధ్యతలో చేపట్టిన నంబాల

కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి

'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు.

## ఎపికి ఆరు కుంకీ ఏనుగుల అప్పగింత

### డిప్యూటీ సిఎం పవన్ సమక్షంలో అప్పగింత కార్యక్రమం

### పంటపొలాలను,.రైతులను కాపాడడమే లక్ష్యమన్న పవన్



# జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి

## పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ: అక్రమ నోట్ల కట్టలు వెలుగుచూసిన కేసులో హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు నిరాకరించింది. జస్టిస్ వర్మ ప్రతిస్పందనతో పాటు మాజీ సిజెఐ రాష్ట్రపతి, ప్రధానులకు రాసిన లేఖలు, అంతర్గత విచారణ కమిటీ నివేదిక, మే 8న సుప్రీంకోర్టు విడుదల చేసిన పత్రికా ప్రకటనను పరిశీలించినట్లు జస్టిస్ అభరు ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. మాండమస్ రిట్ కోరే ముందు, పిటిషనర్ తగిన అధికారుల ముందు ప్రాతినిధ్యం దాఖలు చేయడం ద్వారా తమ ఫిర్యాదును పరిష్కరించుకోవాలని ధర్మాసనం పేర్కొంది. ఈ రిట్ పిటిషన్‌ను స్వీకరించేందుకు తాము నిరాకరిస్తున్నామని, ఈ దశలో ఇతర విజ్ఞప్తులను పరిశీలించాల్సిన అవసరం లేదని ధర్మాసనం తెలిపింది. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ కమిటీ అభియోగం మోపిన తర్వాత మాజీ సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనను రాజీనామా చేయాల్సిందిగా ఆదేశించారు. అయితే రాజీనామా చేసేందుకు జస్టిస్ వర్మ నిరాకరించారు. దీంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధాని మోడీలకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. జస్టిస్ వర్మపైప వచ్చిన ఆరోపణలు వాస్తవమని అంతర్గత కమిటీ తేల్చిందని, వెంటనే క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ న్యాయవాది మాథ్యూస్ నెడుంపారా, మరో ముగ్గురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతర్గత విచారణతో న్యాయపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చుని, అయితే చట్టాల ప్రకారం.. క్రిమినల్ దర్యాప్తుకు ప్రత్యామ్నాయం కాదని పిటిషన్‌లో వారు లేవనెత్తారు. అంతర్గత విచారణను సవాలు చేస్తూ, అధికారిక పోలీస్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చిలో ఈ పిటిషనర్లే సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్



బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ.1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43

ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు

చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

# రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

విశాఖపట్టణం/హైదరాబాద్: తెలుగు రాష్టాల్ల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్టాల్ల్లో కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక–గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.

గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్,

వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది

# ఏపికి ఆరు కుంకీ ఏనుగుల అప్పగింత



**బెంగళూరు:** కర్నాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చాయి. ఏపీకి ఆరు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల అప్పగింత, వాటి సంరక్షణకు సంబంధించిన డాక్యుమెంట్లను పవన్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి, సీఎం సిద్ధరామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందుకొస్తోందన్నారు. ఏపీ, కర్ణాటక మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ ఆకాంక్షించారు. కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం

ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగులను నియంత్రించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించుతారు.

కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్నిసార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగును రక్షించడానికి వీటిని ఉపయోగిస్తారు. సాధారణంగా కుంకీ ఏనుగులుగా మగవాటినే ఎంపిక చేసుకుంటారు. ఎందుకంటే ఇవి మాత్రమే ఒంటరిగా సంచరిస్తుంటాయి. వీటిని బంధించి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. తర్వాత ఆపరేషన్ల కోసం వాడుతుంటారు. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు ఇవి విశ్రమించవు. కొన్నిసార్లు పంట పొలాలపైకి వచ్చిన ఏనుగులతో ఇవి తలపడాల్సి ఉంటుంది కూడా. అందుకే పోరాడడంలోనూ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ఏజెన్సీ ఏరియాల్లో ఏనుగుల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు శ్రీకాకుళం, సాలూరు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందన్నారు. అటవీ భూమిని ఆక్రమించడం వల్ల ఏనుగులే జనవాసాల్లోకి వస్తున్నాయో లేక ఏం జరుగుతుందో తెలియడం లేదన్నారు. కానీ ఈ తరహా సమస్యను కర్ణాటక ప్రభుత్వం చాలా పకడ్బందీ ప్రణాళికతో నిరోధిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈ ప్రభుత్వం చాలా ఏనుగులకు శిక్షణ ఇచ్చిందన్నారు. అంతేకాకుండా అవి ఎలా వ్యవహరించాలో కూడా శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఇక ఏనుగులు జనావాసా ప్రాంతంలోకి రాకుండా..

వాటికి ప్రత్యేక మార్గం ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఆ ప్రాంతంలోని రైతుల భద్రతతో పాటు సురక్షిత చర్యలు తీసుకున్నట్లు అవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలోని పలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగులు ఊళ్లలోకి దూసుకు వచ్చి.. పంట పొలాలను నాశనం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారు. ఏ సమయంలో ఎటువైపు నుంచి ఏనుగులు దాడి చేస్తాయో తెలియన ఓ విధమైన భయాందోళన పరిస్థితి ఆ ప్రాంత ప్రజల్లో నెలకొంది. అంతేకాకుండా.. ఈ ఏనుగుల దాడి కారణంగా.. పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

# కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

**నల్లగొండ:** నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమీషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమీషన్లు తప్ప రేవంత్ ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమీషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమీషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ

కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది.

తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర

ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# నాటు సారా నిర్మూలన పై నవోదయ 2.0..!

**నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు**

**300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం**

**10 లీటర్ల నాటు సారా సీజ్**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి మే21**

–: నాటు సారా నిర్మూలనకై రాష్ట్ర ప్రభుత్వం నవోదయ 2.0 అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని నందికొట్కూరు, ఆత్మకూరు ఎక్సైజ్ సిఐలు ఎస్ ఆర్ నాయక్ మరియు కిషోర్ కుమార్, నంద్యాల జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ దాస్ తెలిపారు . బుధవారం కర్నూలు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్ రవికుమార్ సూచనల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని నీలిషికారి




కాలనీలో జరిపిన దాడులలో నంద్యాల డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సి.ఐ లక్షణ దాసు టీం. నందికొట్కూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ సి.ఐ రామాంజనేయులు, ఎస్.ఐ జుఫ్రూళ్ల టీం ఆత్మకూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ సి.ఐ కిషోర్ కుమార్, ఎస్.ఐ జగదీష్ టీం, మూకుమ్మడిగా జరిపిన దాడులలో 300 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లము ఊట ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారా సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను షికారి మీనాక్షి(26), షికారి గంగ(21) లను అరెస్ట్ చేయడం జరిగింది అని తెలిపారు..

అనంతరం నీలిషికారి కాలనీ వాసులకు నవోదయం 2.%బా% కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు.

# రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోంది

అనంతపురం: రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని,. భయపెట్టి పాలన చేయాలనుకోవడం మూర్ఖత్వం అని వైకాపా సీనియర్ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రె అన్నారు.. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవుచెప్పారు.. ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జల సమావేశంలో పాల్గొన్న మిథున్‌రెడ్డి.. ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరగలేదని స్పష్టం చేశారు.. కట్టుకథలతో మద్యం కుంభకోణం జరిగిందని టీడీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.. ఇక, వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణమైన విషయం అన్నారు.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు ఆపడం దుర్మార్గం

అని ్గ÷ర్ అయ్యారు.. హంద్రీనీవా లైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏపీ ప్రభుత్వంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. మంగళవారం రోజు సంచలన వ్యాఖ్యలుచేసిన విషయం విదితమే.. ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూనే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.. ఇప్పుడు ఉన్న అధికారులు అన్యాయమైన పనులు చేస్తే.. రేపు మళ్లీ మన రోజు వస్తుంది.. ఇప్పుడు పేర్లు రాసిపెట్టుకొండి.. రిటైర్డ్ అయినా.. విదేశాలకు పారిపోయినా.. తీసుకొచ్చిన సినిమా చూపిస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..

# గ్రామ దేవర కార్యక్రమంలో పాల్గొన్న: ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు బుధవారం 21:**

నందికొట్కూరు నియోజకవర్గం మిడ్తూరు మండలం చింతపల్లి గ్రామంలో జరిగిన గ్రామ దేవర కార్యక్రమంలో భాగంగా గ్రామ నాయకులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్న నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య.ఈ కార్యక్రమంలో మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రసాద రెడ్డి, శివరామిరెడ్డి, సర్వోత్తమరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొనడం జరిగినది.





బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతూ బెంబేలెత్తిస్తున్నాయి. 2024 సంవత్సరంలో తులం బంగారం ఏకంగా 30 శాతం పెరిగింది. 10 గ్రాములపై రూ.20 వేల వరకు పెరిగింది. ఈ క్రమంలో బంగారం ధరలు కట్టడి చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. మరి 2025లో బంగారం ధరలను కట్టడి చేసేందుకు కేంద్రం ఏమైనా చర్యలు చేపట్టిందా? అనే ప్రశ్నకు ఆర్థిక శాఖ క్లారిటీ ఇచ్చింది.

దేశీయ మార్కెట్లో స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర ప్రస్తుతం రూ. 78 వేలపైన పలుకుతోంది. 2024 ప్రారంభం నుంచి చూసుకుంటే తులం బంగారం ధర ఏకంగా 30 శాతం పెరిగింది. గత ఏడాది క్రితం 24 క్యారెట్ల బంగారం రేటు రూ.

# బంగారం రేట్లు తగ్గేందుకు.. కేంద్రం చర్యలు చేపట్టిందా?

87,500 వద్ద ఉండగా అది ఇప్పుడు రూ. 87,700 దాటింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదల, భౌగోళిక పరిస్థితులు, దేశాల మధ్య ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకుల పాలసీల వంటివి చాలా అంశాలు ఉంటాయి. ఇక పండగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల వంటి ప్రత్యేక సందర్భాల్లో గిరాకీ పెరిగి బంగారం ధరలు మరింత పెరుగుతాయి.

ఈ క్రమంలో బంగారం ధరల అంశం లోక్‌సభను తాకింది. బంగారం ధరలు తగ్గించేందుకు కేంద్రం ఏమైనా చర్యలు చేపట్టిందా? అని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. ' కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూనియన్ బడ్జెట్ 2024-25 లోనే బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. బంగారం, ఆభరణాలలో దేశీయ విలువ జోడింపును పెంపొందించడం, వినియోగదారులకు బంగారాన్ని మరింత సరసమైనదిగా చేయడమే ఈ నిర్ణయం లక్ష్యం.' అని తెలిపారు.

మరోవైపు.. బంగారం ధరల పెరుగుదల పండగల సీజన్, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లపై ప్రభావం ఏలా ఉంటుందని అడగగా.. బంగారం ధరల పెరుగుదలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి. కానీ, పండగల డిమాండ్‌పై ధరల పెరుగుదల ప్రభావంపై ఎలాంటి కచ్చితమైన అంచనాలు వేయలేదని పేర్కొన్నారు. అలాగే బంగారం ధరల కట్టడి చర్యలు చేపట్టాలనే ఎలాంటి ప్రణాళికలు లేవని స్పష్టం చేశారు. బంగారంపై రాయితీలు ఇచ్చే ఆలోచన సైతం ప్రభుత్వం వద్ద లేదని పేర్కొన్నారు.

ఈ ఏడాది జులైలో ప్రవేశపెట్టిన వవార్షిక బడ్జెట్‌లో బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని 9 శాతం మేర తగ్గించిన క్రమంలో దేశీయంగా బంగారం ధరలు భారీగా దిగివచ్చాయి. అలాంటి చర్యలు ఏవైనా తీసుకోవాలని డిమాండ్ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి క్లారిటీ ఇచ్చారు.

# ఆదాయంలో 30 శాతం కడితేనే సొంతిల్లు..

దేశంలో అందుబాటు ధరల ఇళ్లకు కేరాఫ్‌గా ఉండే హైదరాబాద్ ఇప్పుడు ఖరీదైపోయింది. సొంతింటి కల నెరవేర్చుకోవాలంటే అంత ఈజీ కాదనే చెప్పాలి. ఎందుకంటే ముంబై తర్వాత అత్యంత ఖరీదైన మార్కెట్‌గా హైదరాబాద్ రెండో స్థానానికి చేరుకుంది. వచ్చే ఆదాయంలో 30 శాతం ఈఎంఐ కట్టగలిగితేనే సొంతింటిని కొనే పరిస్థితులు ఉన్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం.

హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్ దాటి కాలనీలు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు అందుబాటు ధరల ఇళ్లకు హైదరాబాద్ చిరునామాగా ఉండగా.. క్రమంగా ఖరీదైన మార్కెట్‌గా మారింది. ఇప్పుడు దేశంలోనే అత్యంత ఖరీదైన రెండో మార్కెట్‌గా నిలిచింది. మొదటి స్థానంలో ముంబై ఉండగా.. ఆ తర్వాత మన హైదరాబాద్ నిలవడం గమనార్హం. ఇప్పుడు హైదరాబాద్ నగరంలో ఇల్లు కొనుగోలు చేయాలంటే తమ ఆదాయంలో 30 శాతం హోమ్ లోన్ ఈఎంఐలకే చెల్లించాల్సి వస్తోందటా. ఈ మేరకు కుటుంబ ఆదాయం, ఇంటి రుణానికి చెల్లించే ఈఎంఐ నిష్పత్తి ఆధారంగా అఫర్డబులిటీ ఇండెక్స్ పేరుతో నైట్ ఫ్రాంక్ ఇండియా ఓ నివేదిక విడుదల చేసింది.



హైదరాబాద్ సిటీలో కొన్ని నెలలుగా స్థిరాస్తి రంగం ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. ఇళ్లు, భూముల ధరలు పెరిగినంతగా ప్రజల ఆదాయాలు పెరగకపోవడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. దీంతో సొంతింటి కలను వాయిదా వేసుకుంటున్నారు. గత మూడేళ్లుగా చూసుకుంటే నగర ప్రజల స్థోమత సూచీ 30 శాతం వద్ద స్థిరంగా కొనసాగుతోంది. 2022 నుంచి 2024 వరకు ఏ మార్పు లేదని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. అంటే వచ్చే ఆదాయంలో 30 శాతం ఈఎంఐ చెల్లించేందుకు సిద్ధమయితేనే ఇల్లు కొనగలరు. ఇక ముంబైలో అయితే 50 శాతం మేర ఈఎంఐ కట్టగలిగితేనే ఇల్లు కొనే పరిస్థితులు ఉన్నాయి. దీంతో దేశంలోనే అత్యంత ఖరీదైన రెండో మార్కెట్‌గా హైదరాబాద్ నిలుస్తోంది. కరోనా మహమ్మారి విజృంభణ అనంతరం వడ్డీ రేట్లు తక్కువగా ఉండడంతో స్థోమత సూచీ 28 శాతానికి వచ్చింది. దీంతో ఎక్కువ మంది సొంతింటి కలను నెరవేర్చుకున్నారు. అయితే, ప్రస్తుతం వడ్డీ రేట్లు అధికంగా ఉన్నాయి. ఈ వడ్డీ రేట్లు దిగివస్తేనే స్థోమత సూచీ మెరుగుపడుతుంది. 2010లో హోమ్ లోన్ వడ్డీ రేట్లు 10.38 శాతం వద్ద ఉన్నాయి. కరోనా సమయంలో వడ్డీ రేట్లు 6.5 టూ 7 శాతం వద్దకు తగ్గాయి. దీంతో సూచీ 28 శాతానికి మెరుగుపడింది. ఇప్పుడు గృహ రుణ వడ్డీ రేట్లు 9 శాతం వద్ద ఉన్నాయి. దీంతో సూచీ 30 శాతానికి పెరిగింది. 20 ఏళ్ల మెచ్యూరిటీ సమయంతో ఇంటి విలువలో 80 శాతం లోన్ పరిగణనలోకి తీసుకుంటి ఈ లెక్కలు వేశారు.

# ఇక ఆ యూపీఐ ఐడీలు పని చేయవు..

ఎక్కువ కాలం వినియోగించని ఇనాక్టివ్ యూపీఐ ఐడీలను బ్లాక్ చేయనున్నారు. భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఏడాదికిపైగా యూపీఐ ఐడీతో ఎలాంటి ట్రాన్సాక్షన్లు నిర్వహించకపోతే వాటిని ఇనాక్టివ్ యూపీఐ ఐడీలుగా పరిగణిస్తారు. ఇలాంటి ఐడీలన్ని ఇకపై నిలిచిపోనున్నాయి. ఎవరైతే ఒకటికి మించి యూపీఐ ఐడీలు క్రియోట్ చేసుకున్నారో వారు ఓసారి చెక్ చేసుకోవడం మంచిది. సాధారణంగా మొబైల్ నెట్‌వర్క్ మార్చినప్పుడు, లేదా కొత్త ఫోన్ నంబర్ తీసుకున్నప్పుడు యూపీఐ ఐడీ, బ్యాంక్ ఖాతాకు లింకైన నంబర్ మార్చడం మర్చిపోతారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం ఇనాక్టివ్ ఫోన్ నంబర్లను 90 రోజుల తర్వాత కొత్త వారికి కేటాయిస్తాయి టెలికాం సంస్థలు. దీంతో బ్యాంక్ ఖాతా, యూపీఐ ఐడీలకు సమస్యలు తలెత్తుతాయి. కొత్త వారికి మీ యూపీఐ, బ్యాంక్ ఖాతాల యాక్సెస్ లభిస్తుంది. దీంతో మోసాలకు పాల్పడే ప్రమాదం ఉంటుంది. అటువంటి సమస్యలకు చెక్ పెట్టేందుకే ఈ ఇనాక్టివ్ యూపీఐ ఐడీలను బ్లాక్ చేస్తోంది ఎన్‌పీసీఐ. 12 నెలలు అంత కంటే ఎక్కువ కాలం పాటు ఇనాక్టివ్‌గా ఉన్న యూపీఐ ఐడీలను క్లోజ్ చేయనున్నారు. యూపీఐ ప్రొవైడర్లు గత ఏడాది కాలంలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించని సంబంధిత మొబైల్ నంబర్లతో పాటుగా యూపీఐ ఐడీలను గుర్తిస్తాయి. ఇలాంటి ఇనాక్టివ్ యూపీఐ ఐడీలను ఇన్‌వర్డ్ క్రెడిట్ ట్రాన్సాక్షన్లు బ్లాక్ చేస్తారు. యూపీఐ మ్యాపర్ నుంచి డీరిజిస్టర్ చేస్తారు. అయితే, ఇలా ఇనాక్టివ్ అయిన మళ్లీ యాక్టివ్ చేసుకోవచ్చు. అందుకోసం యూపీఐ యాప్‌లోకి వెళ్లి బ్యాంక్ ఖాతాకు లింకైన మొబైల్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు.

# మార్కెట్లోకి హోండా యాక్టివా ఎలక్ట్రిక్ స్కూటర్లు..

ఇతర ప్రధాన ఎలక్ట్రిక్ స్కూటర్లకు పోటీగా హోండా యాక్టివా నుంచి కూడా ఎలక్ట్రిక్ స్కూటర్లు మార్కెట్లోకి వచ్చేశాయి. ఇక కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జనవరి 1 నుంచే బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. డీలర్స్ దగ్గర రూ. 1000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. వీటి ధరలు భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో- 2025లో తెలుస్తాయి. ఇక డెలివరీలు కూడా ఫిబ్రవరిలోనే ప్రారంభం కానున్నాయి. హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా.. గతేడాదే ఎలక్ట్రిక్ స్కూటర్లపై ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తమ కంపెనీ నుంచి ఫస్ట్ ఎవర్ ఎలక్ట్రిక్ టూ- వీలర్స్ హోండా యాక్టివ్ ఇ, క్యూసీ1 బుకింగ్స్ ప్రారంభించింది. 2025 జనవరి 1 నుంచే ఇది మొదలైంది. ప్రధాన నగరాల్లోని ఎంపిక చేసిన హోండా డీలర్‌షిప్స్ నుంచి రూ. 1000 చెల్లించి బుకింగ్స్ రిజర్వ్ చేసుకోవచ్చని వెల్లడించింది. యాక్టివా ఇ.. బెంగళూరు, ఢిల్లీ, ముంబైల్లో అందుబాటులో ఉండగా.. క్యూసీ1 మాత్రం ఢిల్లీ, ముంబై, పుణె, బెంగళూరు, హైదరాబాద్, చండీగఢ్‌లో బుకింగ్‌కు అందుబాటులో ఉందని వెల్లడించింది. 2024 నవంబర్ నెలలోనే హోండా ఈ మోడల్స్‌ను ఆవిష్కరించింది. దీనితోనే హోండా.. ఎలక్ట్రిక్ వెహికిల్ మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చింది.




ఇక ఈ మోడళ్ల ధరల్ని ఫిబ్రవరిలో జరగనున్న 2025 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రకటించనున్నారు. ఇక ఆ తర్వాతే అదే నెలలో ఫిబ్రవరి నుంచే డెలివరీలు కూడా ప్రారంభించనున్నారు. ఇప్పుడు మనం ఈ స్కూటర్ల ఫీచర్ల గురించి తెలుసుకుందాం. హోండా యాక్టివా ఇ స్కూటర్ స్వాపబుల్ బ్యాటరీతో వస్తుంది. స్వాపబుల్ అంటే ఛార్జింగ్ కోసం బయటికి తీసే వీలుంటుంది. క్యూసీ1 మాత్రం ఫిక్స్‌డ్ బ్యాటరీతో వస్తుంది. యాక్టివా ఇ- స్కూటర్‌లో రెండు అవర్ బ్యాటరీల్ని అమర్చారు. ఇక్కడ సింగిల్ ఛార్జింగ్‌తోనే 102 కిలోమీటర్లు ప్రయాణించే వీలుంటుంది. గరిష్ట వేగం అంటే గంటకు 80 కిలోమీటర్లు వెళ్లొచ్చు. ఇందులో మొత్తం మూడు రైడింగ్ మోడ్స్ ఉండనున్నాయి. ఇప్పటి యాక్టివా స్కూటర్ డిజైన్‌లో చిన్న చిన్న మార్పులు చేసి యాక్టివా ఇ డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇక హోండా క్యూసీ1 ను భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగానే సంస్థ తీసుకొచ్చింది. తక్కువ దూరం ప్రయాణాల కోసం దీనిని రూపొందించారు. యాక్టివా తరహాలోనే ఉన్నప్పటికీ ఇక్కడ ఎల్‌ఈడీ డీఆర్‌ఎల్స్‌ను ఇవ్వలేదు. దీంట్లో 1.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌ను ఫిక్స్‌డ్‌గా అమర్చారు. ఒక్కసారి ఛార్జింగ్‌తో 80 కి.మీ. ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం 50 కి.మీ. ఇందులో 5 అంగుళాల ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంటల్ ప్యానెల్, టైప్- సి పోర్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

# సారీ చెబితే సరిపోదు.. రాజీనామా చేయండి..

మణిపూర్‌లో ఈ ఏడాది జరిగిన అల్లర్లు, హింసాకాండ గురించి అందరికీ తెలిసిందే. అయితే రెండ్రోజుల క్రితమే దీనిపై స్పందించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణలు చెప్పారు. అయితే తాము ఈ క్షమాపణను స్వీకరించబోమని సీపీఐ తేల్చి చెప్పింది. ముఖ్యంగా తమకు కావాల్సింది సీఎం క్షమాపణలు మాత్రమే కాదని.. రాష్ట్రంలో శాంతి భద్రతల అమలు అని వివరించింది. వీలయినంత తొందరగా సీఎం బిరేన్ సింగ్ తన తప్పును ఒప్పుకుని పదవికి రాజీనామా చేయాలని కోరింది. గతేడాది మణిపూర్‌లో జరిగిన అల్లర్లు, హింసాకాండ గురించి దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ తెలిసిందే. అయితే రెండ్రోజుల క్రితమే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి గతాన్ని మర్చిపోయి ప్రజలు తనను క్షమించాలని కోరారు. అలాగే 2024 దురదృష్టకర సంవత్సరంగా పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీపీఐ.. సీఎం క్షమాపణలను ఖండిస్తున్నట్లు వివరించింది. అయినా తమకు కావాల్సింది ముఖ్యమంత్రి దగ్గర నుంచి క్షమాపణలు కాదని.. రాజీనామా అంటూ చెప్పుకొచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.



2023వ సంవత్సరం మే 3వ తేదీ నుంచి కుకీ, మైతేయిల మధ్య ఘర్షణలు చెలరేగగా.. ఈ హింసాకాండలో మొత్తం 200 మందికి పైగా చనిపోయియారు. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. పోలీసుల వద్ద నుంచి నిరసనకారులు పెద్ద ఎత్తున ఆయుధాలను దోచుకున్నారు. అయితే నూతన సంవత్సరం సందర్భంగా మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్.. రాష్ట్రంలో జరిగిన హింసాకాండపై స్పందించారు. గతంలో జరిగిన అన్నింటినీ మర్చిపోయి ప్రజలు తనను క్షమించాలని కోరారు.

ఇంఫాల్‌లో జరిగిన ఓ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. హింసాకాండను నిర్వహించడంపై ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణ జరుగుతుందని తెలిపారు. 2024వ సంవత్సరం చాలా దురదృష్టకరంగా గడిచిందన్నారు. ఈ హింసాకాండ వల్ల అనేక మంది తమ ప్రియమైన వారిని కోల్పోయారని, మరికొందరు తమ ఇళ్లు వదిలిపెట్టి మరీ వెళ్లిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీనంతటికీ తాను చింతిస్తున్నట్లు గతేడాది డిసెంబర్ 31వ తేదీ రోజు వివరించారు. అలాగే 2025లోనైనా రాష్ట్రంలో పూర్తిస్థాయి శాంతి భద్రతలు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే తాజాగా దీనిపై సీపీఐ స్పందించింది. ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ చెప్పిన క్షమాపణలను తాము ఖండిస్తున్నట్లు వివరించింది. తమకు కావాల్సింది క్షమాపణలు కాదని తేల్చి చెప్పింది. రాష్ట్రంలో శాంతి, భద్రతలను కట్టడి చేయలేకపోయిన సీఎం.. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి చేతగాని తనం వల్లే 200 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది నిరాశ్రయులు అయ్యారని వెల్లడించింది. ప్రభుత్వం ఇప్పటికైనా ఆ విషయాన్ని గుర్తించి.. అందరి ముందు ఒప్పుకోవాలని కోరింది. ఆ తర్వాతే సీఎం బిరేన్ సింగ్.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరింది.



# 2 వేల నోట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన..

2023 మే నెలలో రిజర్వ్ బ్యాంక్.. పెద్ద నోట్లు అంటే రూ. 2 వేల నోట్లను వ్యవస్థ నుంచి ఉపసంహరించు కుంటున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి వీటిని జనం వెనక్కి ఇచ్చేస్తున్నారు. ఇప్పటికీ ఈ నోట్లను మాత్రం రద్దు చేయలేదన్న సంగతి తెలిసిందే. ఇంకా జనం దగ్గర ఈ నోట్లు ఉన్నాయని చెబుతోంది. పూర్తి వివరాలు చూద్దాం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొంత కాలం కిందట రూ. 2 వేల నోట్లు ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. అంటే సర్క్యులేషన్ నుంచి వీటిని తొలగించే.. బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకొస్తోంది. 2023, మే 19న రూ. 2 వేల నోట్లను వ్యవస్థ నుంచి వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆరోజున సర్క్యులేషన్‌లో రూ. 3.56 లక్షల కోట్ల విలువైన 2 వేల రూపాయల నోట్లు ఉన్నాయి. ఇక అప్పటి నుంచి జనం రూ. 2 వేల నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ లేదా ఎక్స్ఛేంజ్ చేసుకోవడం చేశారు. తర్వాత.. ఆర్బీఐ కార్యాల యాల్లో మాత్రం ఇలా ఎక్స్ఛేంజీ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఇంకా జనం తమ దగ్గర ఉన్న ఈ పెద్ద నోట్లను మార్చుకుంటున్నారని చెప్పొచ్చు. తాజాగా ఇప్పుడు రూ. 2 వేల నోట్లపై ఆర్బీఐ మరోసారి ప్రకటన చేసింది. ఎప్పటికప్పుడు సర్క్యులేషన్లో ఉన్న ఈ నోట్ల విలువ ఎంత ఉంది.. ఎంత వెనక్కి వచ్చింది వంటి వివరాల్ని వెల్లడిస్తూనే ఉంది. ఇక 2023 మే నుంచి.. ఇప్పటివరకు 98.12 శాతం వెనక్కి వచ్చినట్లు ఆర్బీఐ తాజాగా బుధవారం రోజు ప్రకటన చేసింది. అయితే ఇంకా రూ. 6691 కోట్ల మేర విలువైన రూ. 2 వేల నోట్లు ప్రజల దగ్గరే ఉన్నట్లు తెలిపింది.

మే నెలలో ఉపసంహరణపై ప్రకటన చేసిన ఆర్బీఐ.. 2023, అక్టోబర్ 7 వరకు ఈ నోట్లను అన్ని బ్యాంక్ బ్రాంచుల్లో మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది. తర్వాత ఇప్పుడు మాత్రం 19 రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయాల్లో మాత్రమే ఈ సదుపాయం ఉంది. అంటే ఇక్కడ మాత్రమే ఎక్స్ఛేంజ్ లేదా డిపాజిట్ చేసుకోవచ్చని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో ఆర్బీఐ కార్యాలయం ఉంది. ఇక్కడ రూ. 2 వేల నోట్లను మార్చుకోవచ్చు.

ఇంకా రూ. 2 వేల నోట్లను ఇండియా పోస్ట్ నుంచి కూడా తమ బ్యాంక్ అకౌంట్లలో డిపాజిట్ చేసుకునేందుకు ఆర్బీఐ ఇష్యూ ఆఫీసులకు పోస్ట్ చేయొచ్చని వెల్లడించింది. అయితే ఇక్కడే ఒక విషయం గమనించాలి. రూ. 2 వేల నోట్లను ఇప్పటికీ రద్దు చేయలేదు. ఇది ఇప్పటికీ లీగల్ టెండర్‌గానే (చట్టబద్ధ కరెన్సీ) కొనసాగుతోంది. అంటే ఇవి ఇప్పటికీ చెల్లుతాయని చెప్పొచ్చు. 2016 నవంబర్‌లో అప్పటి పెద్ద నోట్లు అయిన రూ. 500, రూ. 1000 నోట్లు రద్దు చేసిన తర్వాత.. రూ. 2 వేల నోట్లను పరిచయం చేసింది ఆర్బీఐ. తర్వాత కొత్త రూ. 500 నోట్లను కూడా లాంఛ్ చేసింది. ఈ క్రమంలోనే రూ. 2 వేల నోట్లు మాత్రం ఉపసంహరించుకుంటోంది. ఇప్పుడు రూ. 500 నోటు మాత్రమే పెద్ద నోటుగా ఉంది. అయితే మరోవైపు రూ. 1000, రూ. 2000 నోట్లను మళ్లీ తీసుకొస్తారని నెట్టింట ప్రచారం జరుగుతుండగా.. కేంద్రం కూడా స్పందించింది. అలాంటి ప్రణాళిక ఏదీ ప్రభుత్వం దగ్గర లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇటీవల రాజ్యసభలో స్పష్టం చేశారు.

# పీపీఎఫ్ పథకంపై తగ్గుతున్న ఆసక్తి..

పెట్టుబడులు పెట్టి మంచి రిటర్న్స్ కావాలన్నా.. పన్ను తగ్గించుకోవాలన్నా ఇప్పటికీ గొప్ప పథకం అంటే పీపీఎఫ్ గురించి ప్రధానంగా చెప్పుకుంటారు. అయితే.. గత కొన్నేళ్లుగా చూస్తే ఈ పథకం పెద్దగా ఇన్వెస్టర్లను ఆకర్షించలేకపోతోంది. దీనికి కారణాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా వడ్డీ రేట్లు క్రమంగా తగ్గుతూ వస్తుండటం సహా బ్యాంక్ డిపాజిట్ల కంటే కూడా తక్కువ స్థాయిలో ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.



మీరు ఎక్కడైనా పెట్టుబడులు పెడుతున్నారా? వార్షిక ప్రాతిపదికన మంచి రిటర్న్స్ వస్తున్నాయా? ఏటా రిటర్న్స్ తగ్గుతూ ఉన్న పథకాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారా.. వైదొలుగుతారా? చాలా మంది ఇంట్రెస్ట్ ఉండదనే చెబుతారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉన్న చిన్న మొత్తాల పొదుపు పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పరిస్థితి సరిగ్గా అలానే ఉందని చెప్పొచ్చు. ఒకప్పుడు ఇందులో వడ్డీ రేట్లు రికార్డు స్థాయిలో ఉండగా.. ఇప్పుడు తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా స్థిరంగానే ఉంటూ వస్తోంది. పెరగట్లేదు. అందుకే ఆకర్షణ కోల్పోతుంది. తాజాగా 2025 జనవరి- మార్చి సమయానికి వడ్డీ రేట్లను ప్రకటించగా.. పీపీఎఫ్ ఇన్వెస్టర్లకు మరోసారి నిరాశే ఎదురైంది. వడ్డీ రేటు 7.10 శాతంగానే కొనసాగుతుందని స్పష్టం చేసింది.

గత రెండు దశాబ్దాల్లో చూస్తే పీపీఎఫ్ వంటి ప్రభుత్వ పథకం సహా ఇతర బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో వడ్డీ రేట్లు తగ్గుతూ వచ్చాయి. అయితే ఇందులో పీపీఎఫ్ వడ్డీ రేటు మాత్రమే భారీగా దిగొచ్చిందని చెప్పొచ్చు. సరిగ్గా 2000వ సంవత్సరంలో ఇక్కడ వడ్డీ రేటు ఏకంగా 12 శాతంగా ఉండగా.. ఇప్పుడు అది దాదాపు 5 శాతం తగ్గడం.. కొన్నేళ్లుగా వరుసగా తగ్గుతూనే వస్తుండటం పెరుగుతుందన్న ఆశలు పెట్టుకుంటున్నా కేంద్రం పెంచకపోవడం ఇవన్నీ ఈ స్కీంపై ఆశలు తగ్గించేలా చేస్తోంది. 1999 ఏప్రిల్ 1 నుంచి 2000 జనవరి 14 మధ్య ఈ పథకంలో వడ్డీ రేటు ఏకంగా 12 శాతంగా ఉండేది. మరుసటి ఏడాది ఒక శాతం తగ్గి 11 శాతానికి చేరింది. అక్కడి నుంచి మరుసటి ఏడాది 9.5 శాతానికి దిగొచ్చింది. 2002-03 మధ్య 9 శాతంగా ఉండగా.. 2003 మార్చి 1 నుంచి 2011 నవంబర్ 30 వరకు 8 శాతం వడ్డీ కొనసాగింది. తర్వాత 2011-12లో 8.6 శాతానికి, 2012-13లో 8.8 శాతానికి పెరిగింది. 2013- 2016 మధ్య 8.7 శాతానికి పడిపోయింది. ఇలా వరుస సంవత్సరాల్లో తగ్గుకుంటూ వచ్చి.. 2020 ఏప్రిల్ 1 నాటికి అది 7.10 శాతానికి చేరింది. మళ్లీ అప్పటి నుంచి నాలుగేళ్లు దాటినా అదే వడ్డీ రేటు ఉంది.

ఈ పథకంలో ఉన్న అతిపెద్ద బెనిఫిట్ ట్రిపుల్ టాక్స్ బెనిఫిట్. అంటే ఇక్కడ పెట్టుబడులపై, వడ్డీ ఆదాయంపై, మెచ్యూరిటీ రిటర్న్స్‌పై ఎలాంటి పన్ను పడదు. అయితే ఇది పాత పన్ను విధానానికే వర్తిస్తుంది. కొత్త పన్ను విధానంలో ఈ బెనిఫిట్ లేదు. ఇది కూడా ఆకర్షణ తగ్గేందుకు ఒక కారణంగా తెలుస్తోంది.

పీపీఎఫ్ స్కీమ్ విషయానికి వస్తే.. ఇది స్మాల్ సేవింగ్స్ పథకం. ఇక్కడ ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 500 నుంచి గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. డిపాజిట్లను ఏక మొత్తంలో లేదా ఇన్‌స్టాల్‌మెంట్లలో చెల్లించొచ్చు. ఇక్కడ పెట్టుబడులపై లోన్లు కూడా తీసుకోవచ్చు. వరుసగా 15 సంవత్సరాలు ఇన్వెస్ట్‌మెంట్లు చేయాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 కింద పాత పన్ను విధానంలో గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు ఆదా చేసుకోవచ్చు.

# ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్..

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తాజాగా న్యూ ఇయర్ సేల్ లాంఛ్ చేసింది. దీంట్లో లైట్, వాల్యూ అని రెండు వేర్వేరు ఆఫర్లు ప్రకటించింది. . లైట్ ఆఫర్ కింద ఎయిర్‌లైన్స్ అఫీషియల్ మొబైల్ అప్లికేషన్ నుంచి లాగిన్ అయ్యే లోయాల్టీ మెంబర్స్ కు అందుబాటులో ఉంటుందని వెల్లడించింది ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. ఈ ఆఫర్‌లో భాగంగా బేస్ ఫేర్, టాక్సెస్, ఎయిర్ పోర్ట్ ఛార్జీలు అన్నీ కలిసి ఉంటాయి. కన్వీనియెన్స్ రుసుములు, ఆన్సిల్లరీ సర్వీస్ రుసుములు మాత్రం వేరుగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. ఇక్కడ టికెట్లు బుక్ చేసుకునే వారికి ఎయిర్‌లైన్స్ న్యూకాయిన్స్ కూడా ప్రొవైడ్ చేస్తున్నట్లు తెలిపింది. స్టేటస్‌ను బట్టి.. బుకింగ్ చేసే సమయంలో మొదటి పేరు, లాస్ట్ పేరు, మొబైల్ నంబర్ వంటి వివరాలన్నీ నమోదు చేయాలన్ని పేర్కొంది. ప్రభుత్వం జారీ చేసే అధికారిక ఐడీకి, ఈ డీటెయిల్స్ సరితూగాలని చెప్పింది. ఇక ఈ ఆఫర్ సక్సెస్‌ఫుల్ బుకింగ్స్‌కే వర్తిస్తుందని తెలిపింది. అంటే పూర్తి క్యాన్సిలేషన్‌పై వర్తించదని చెప్పింది. పూర్తి క్యాన్సిలేషన్ చేస్తే.. అప్పుడు మీకు క్రెడిట్ అయిన డిస్కౌంట్ మళ్లీ వెనక్కి తీసుకోనున్నట్లు వెల్లడించింది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ బేసిస్‌లోనే ఇన్వెంటరీ ఆఫర్ ఉంటుందని పేర్కొంది. సీట్స్ పరిమిత సంఖ్యలోనే ఉంటాయని.. అన్ని రోజుల్లో అన్ని ఫ్లైట్స్‌లో లేదా అన్ని రూట్లలో సీట్స్ అన్ని వేళల్లో కుదరకపోవచ్చని వివరించింది. ఈ ఆఫర్ కింద సీట్స్ ఫుల్ అయిపోతే.. అప్పుడు రెగ్యులర్ రుసుములు వర్తిస్తాయని తెలిపింది.

ఉత్తేజిత దినపత్రిక

# రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం

**రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేదల కడుపులు కాల్చడమా,**

**కలెక్టర్ ప్రత్యేక అనుమతి తీసుకుని నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని డిప్యూటీ తాహసిల్దార్ కు వినతి:సీపీఐ**

**రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల**



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మినూరు మే 21**

బుధవారం పట్టణంలో పలు వార్డులలో రేషన్ కార్డుల దారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయకుండా కడుపులు కార్చడం దుర్మార్గమని, తక్షణమే జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతి తీసుకుని పంపిణీ చేయలేని రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కోరుతూ బుధవారం రోజున సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో డిప్యూటీ తాహశీల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని లిభారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ లిపట్టణ కార్యదర్శి జి. రంగన్న,సిపిఐ మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్, తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎమ్మిగనూరు పట్టణంలోని పలు వార్డులలోని కార్డు దారులకు మే నెలకు సంబంధించిన రేషన్ అందకా నానా ఇబ్బందులకు గురయ్యారనీ 17వ తేదీ సాయంత్రం లోపు కార్డు దారులకు రేషన్ ను పంపిణీని పూర్తి చేయక పోవడం వల్ల మే నెలకు సంబంధించిన రేషన్ కోటాను కార్డుదారులు నష్టపోయారననీ వారు తెలిపారు. రెవిన్యూ అధికారులు ఈ నెల 3, 5వ తేదీలలో పట్టణంలోని పలు రేషన్ దుకాణాలపై దాడులు నిర్వహించిన సందర్భంలో దాదాపు 5 కు పైగా రేషన్ దుకాణాల్లో అవకాశాలు జరగడంతో ఆ షాపులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేయడం జరిగిందని,దీంతో రెవెన్యూ అధికారులు మే నెలకు సంబంధించి ఆ దుకాణాలకు రేషన్ సరుకులు పంపిణీకి అనుమతిని రద్దు చేశారాని, రద్దు చేసిన దుకాణాలకు సంబంధించిన ఆ వార్డు కార్డుదారులకు ఇన్చార్జిల ద్వారా, ఇతరుల ద్వారా వెంటనే రేషన్ పంపిణీ చేయాల్సిన బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉంది.కానీ అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం వల్ల ఈనెల 15వ తేదీ గురువారం పూర్తి అవుతున్నా కూడా రేషన్ ఎవరు పంపిణీ చేయలేదనీ. రేషన్ దుకాణాదారుడు 17వ తేదీ సాయంత్రంలోగా కార్డుదారులకు పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ చేయాలనే నిబంధన ఉన్న ఆ సమయంలోగా రేషన్ పంపిణీ చేయలేకపోవడంతో మిషన్ ను ప్రభుత్వం లాక్ చేయడం జరిగింది. కార్డు దారులకు రేషన్ అందక నష్టపోవడం జరిగిందని ఉందనీ కార్డుదారులు తెలిపారు.

1వ తేదీ నుంచి తమకు రేషన్ పంపిణీ చేయాల్సి ఉన్నా ఎందుకు రెవిన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని కార్డుదారులు గగ్గోలు పెట్టారని. రెవెన్యూ అధికారులు మాత్రం తీరికగా 10 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుని మిగిలిన 2 రోజులలో రేషన్ పంపిణీ చేయాలని ఇన్చార్జిలకు ఆదేశాలు ఇవ్వడం అధికారుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం వారు తెలిపారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్డుదారులు మే నెలకు సంబంధించిన నిత్యవసరల సరుకుల కోటాను నష్ట పోకుండా చూడాలని తక్షణమే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ప్రత్యేక అనుమతి తీసుకుని నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దాదావలి, ఏసీ జబ్బర్, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్, నరసింహులు, సుంకన్న, నాగరాజు,నరసింహులు, గోపాల్, నరసప్ప,ఎల్లప్ప, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయం నిర్వహణపై ఈవో సమీక్ష

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, మే 21.**





తిరుపతిలోని శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయం లో చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల దృష్ట్యా టిటిడిలో కొత్తగా ఓ ట్రస్ట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణపై అధికారులతో ఆసుపత్రి సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ పద్మావతీ చిన్న పిల్లల హృదయాలయంలో ఇప్పటికే శ్రీ వేంకటేశ్వర ఆపన్న హృదయం స్కీం ఉందని, ఈ స్కీం క్రింద రూ. 1 లక్ష దాత విరాళం అందిస్తే నిరాదరణకు గురైన పేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా ఆపరేషన్ చేసే సదుపాయం ఉందన్నారు. టిటిడిలో ఇప్పటికే ఉన్న పలు ట్రస్ట్ తరహాలో నూతనంగా చిన్నపిల్లల వైద్య సేవల కోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటుకు సంబంధించిన నియమ నిబంధనలపై నివేదిక తయారు చేయాలని అన్నారు .చిన్న పిల్లలను దైవ సమానులుగా భావించి, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పసి బిడ్డలకు చక్కటి వైద్య సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. పిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో పాటు చిన్న పిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్య పరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నూతన భవన నిర్మాణం తాజా పరిస్థితిపై ఆయన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేసి తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అటు తర్వాత చిన్న పిల్లల ఐసియూ బ్లాక్, జనరల్ వార్డు, ఓపి బ్లాక్ లోని పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులను, పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లి తండ్రులు ఆసుపత్రి లో అందుతున్న వైద్య సేవలపై తమ సంతృప్తిని ఈవోకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం, సిఈ శ్రీ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఆర్ ఎంవో డాక్టర్ భరత్, ఎస్.ఈలు శ్రీ వేంకటేశ్వర్లు, మనోహరం తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆంగ్లం పరీక్షకు 28 మంది విద్యార్థులు గైహాజరు

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ మే 21**

సి.బెళగల్ మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 28మంది విద్యార్థులు గై హాజరయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు వెంకటరమణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 86 మంది విద్యార్థులు ఆంగ్లం పరీక్ష రాయాల్సి ఉండగా 74 మంది విద్యార్థులు హాజరై 12 మంది విద్యార్థులు గైహజరయ్యారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో 70 మంది విద్యార్థులకు గాను 54 విద్యార్థులు పరీక్షకు హాజరై 16 విద్యార్థులు గైహాజరయ్యారని పరీక్షా కేంద్రాల నిర్వహకులు తెలిపారు.

## ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్.సి.కాలనీ నందు సి.సి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు మే 21 బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన కాలనీ వాసులు లిసీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ నందు సిసి రోడ్లు లేక, వర్షపు నీటితో గుంతల మయంగా మారిన దుస్థితి కాలనీవాసులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఎమ్మిగనూరు మునిసిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారంనాడు నాడు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ ప్రజలతో కలసి, ఎమ్మిగనూరు మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ నందు మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి విష జ్వరాల బారిన పడుతున్నారని ,వృద్ధులు,చిన్నారులు కాలు జారీ గాయాలు అయ్యే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పక్కనే ఉన్న వంకలో కోళ్ల వ్యర్థాలు ,మురుగునీరు పూర్తిగా కాలనీ లోకి ప్రవేశించి దుర్వాసన విపరీతంగా ఉన్నదని తెలిపారు. తక్షణమే వంకకు ప్రహరీ గోడ నిర్మించి వంక మురుగునీరు కాలనీలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.తక్షణమే అధికారులు స్పందించి న్యూ ఎస్సీ కాలనీ నందు మౌలిక వసతులతో పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వంకకు ప్రహరీ గోడ తక్షణమే యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు నాయకులు బాలరాజు,బాబు,కాలనీ వాసులు సులోచన, పద్మావతి,మేరీ,ఎర్రమ్మ,జ్యోతి, బాలస్వామి, నగేష్,రాజు, శాంతి,లక్ష్మీ,చిట్టెమ్మ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు - యార్లపల్లి గోపి

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, మే 21**





తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహానికి తిరుపతి నగరం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రేస్ నాయకులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా యార్లపల్లి గోపి మాట్లాడుతూ సాంకేతిక రంగానికి మారుపేరు రాజీవ్ గాంధీ అని, ఈరోజు అనేక లక్షల మంది యువత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఉద్యోగాలు సంపాదించారంటే అది రాజీవ్ గాంధీ ముందు చూపేనని, 18 సంవత్సరాలకు ఓటు హక్కు, పంచాయతీరాజ్ చట్టం, రాజకీయ ఫిరాయింపులు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడ్వకేట్ రవి, అబ్దుల్ మజీద్ పటేల్, పుత్తూరు సిద్ధయ్య(చిన్నారావు), మించల తేజవతి, బేరిపల్లి వెంకటేష్ గౌడ్, పట్నం భాస్కర్ గౌడ్, మున్వర్, సమీనుల్లా, వీర మోహన్, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్రకు శ్రీకారం చుట్టిన జిల్లా యంత్రాంగం



**అట్టహాసంగా ప్రారంభం అయిన 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవం జూన్ 21 సంబంధించిన క్యాంపెయిన్ యోగాంధ్ర 2025యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ యోగాను నిత్యం ప్రతి ఒక్కరు గంట పాటు చేసి వారి శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,మే 21:**



యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలి అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ మరియు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో అంతర్జాతీయ యోగా డే జూన్ 21 కర్టన్ రైజర్ యోగాంధ్రా 2025 కు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా యోగా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలసి అట్టహాసంగా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. యోగా మాస్టర్లు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి యోగ ఆసనాలను నేడు సుమారు 45 నిమిషాల పాటు యోగా చేయడం జరిగిందని తెలిపారు. జూన్ 21 వ తేది విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా డే ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లుగా కలెక్టర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతోందని ఆయన తెలిపారు. యోగాపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సి అవసరం ఉందని, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా మే 21 నుంచి జూన్ 21వ వరకు యోగా మాసంగా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. యోగాను తిరుపతి జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్,వార్డులలో, మండల, గ్రామ పంచాయతిలలో మారుమూల గ్రామాలలో చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరికి తెలియపరుచవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని తెలిపారు. అలాగే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు యోగా ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని ఆయన తెలిపారు. మన సంస్కృతి,సాంప్రదాయలు ప్రతిబింభించేలా యోగా గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యపరచవలసిన అవసరం ఉందని తెలిపారు . శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ యోగాను కేవలం జూన్ 21 వ తేది మాత్రానికే పరిమితం చేయకుండా నిత్యం చేయాలని విశ్వమంతా యోగాతో ఆరోగ్యం నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా డే ని ఐదు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి విశాఖపట్నంలో జరిగే యోగా డే లో పాల్గొంటున్నారని తెలిపారు. సూరత్ లో 2023లో కోటి యాభై మూడు లక్షల మందితో సామూహిక యోగా నిర్వహించి గిన్నీస్ రికార్డ్ నెలకొల్పారని , ఆ రికార్డ్ బద్దలు కొట్టేలా రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల మందితో సామూహిక యోగా ను నిర్వహిస్తోందని తెలిపారు. యోగాను నిత్యం ప్రతి ఒక్కరు గంట పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ : సామూహిక యోగా లో ప్రజలంతా పాల్గొని రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేయాలని

ఆయన కోరారు. కాగా యోగాను ప్రతి ఒక్కరు జీవితంలో ఒకభాగం చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతోందని ఆయన తెలిపారు. యోగాపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సి అవసరం ఉందని శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహద పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఉమా, రిజిస్ట్రార్ రజని , జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు , రెవిన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరి బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మున్సిపల్ కార్పోరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ సిబ్బంది , ప్రజా ప్రతినిధులు, యువత మరియు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ వాహనాల రద్దుపై డీలర్లు హర్షం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**








ఎమ్మిగనూరు మే 21 బుధవారం పట్టణంలో స్థానిక డీలర్లు హర్షం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బీవీ చిత్రపటాలకు పాలాభిషేకం

ఎమ్మిగనూరు :-రేషన్ ( యండియు ) వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం పట్ల ఎమ్మిగనూరు రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మినూరు పట్టణంలోని డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను నాశనం చేసి కేవలం స్టాక్ పాయింట్గా పెట్టిందని, డోర్ డెలివరీ పేరుతో అనాలోచితంగా తెచ్చిన రేషన్ వాహనాల వల్ల ఆర్థిక భారంతో పాటు అనేక సమస్యలు తెచ్చి పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ వాహనాలను రద్దు చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. డీలర్ల వ్యవసపై సీఎం చంద్రబాబు నమ్మకం ఉంచారని ధన్యవాదాలు తెలిపారు. జూన్ 1వ తేదీ నుండి రేషన్ దుకాణాల వద్దే బియ్యం పంపిణీ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డికి కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# తెల్లబట్టలపై మరకలు పోతాయ్..







తెల్ల బట్టలు వేసుకోవడానికి ఎంత బావుంటాయో.. వాటిని మెంటెయిన్ చేయడం కూడా అంతే కష్టం. ముఖ్యంగా కాలర్, అండర్ ఆర్మ్స్ మీద మరకలు అలానే ఉండిపోతాయి. ఏం చేస్తే ఈ మరకలు పోతాయో అస్సలు తెలియవు. అందుకే ఇప్పుడు చెప్పే ఈ టిప్స్‌తో సమస్యని దూరం చేసుకోండి. వైట్ క్లాత్స్‌పై ఏ చిన్న మరక పడినా అది వదలడం చాలా కష్టం. అందుకే వాటిని సెపరేట్‌గా ఉతకండి. ఇతర బట్టలతో కలిపి ఉతకొద్దు. ఎందుకంటే, వాటి రంగులు తెల్ల బట్టలకి అంటుకుని మొండి మరకల్లా మారతాయి. వీటిని కెమికల్స్‌తో నిండిన సబ్బు, డిటర్జెంట్ లిక్విడ్స్‌తో రుద్దితే ఉన్న తెల్లదనం తగ్గిపోతుంది.
తెల్లని బట్టల్ని ఎక్కువసేపు ఎండలో ఆరబెట్టొద్దు. కొద్దిసేపు ఆరబెడితే చాలు. ఎక్కువగా వేడి ఉన్న ప్రాంతంలో ఆరేస్తే కలర్ చేంజ్ అవుతాయి. కాబట్టి, అలా చేయకండి.
చాలా మంది బట్టలకి బ్లీచ్ వాడుతుంటారు. వీటిని వాడాలనుకుంటే కాటన్ వాటికి వాడండి. అన్ని బట్టలకు వద్దు. వీటిని వాడడం వల్ల బట్టలు పాడయ్యే అవకాశం ఉంది. చాలా మంది బట్టలు తెల్లగా మారాలని ఎక్కువగా సబ్బు వాడతారు. దీని వల్ల తెల్ల బట్టలపై మురికి పోతుంది. కానీ, తెలుపుదనం తగ్గుతుంది. కాబట్టి, కొద్దిగా మాత్రమే సబ్బుని వాడండి. నీలిరంగు.. ఆప్టికల్ బ్రైటెనర్స్‌ని పిలిచే నీలిరంగుని వాడతారు. వీటిని వాడితే బట్టలు తెల్లగా మారతాయి. ఈ బ్లూయింగ్ ఏజెంట్‌ని వాషింగ్ మెషిన్‌లో డిటర్జెంట్ డిస్పెన్సర్‌కి జోడించవచ్చు. నిమ్మరసం.. నిమ్మరసం కూడా తెల్ల బట్టలపై మరకల్ని ఈజీగా దూరం చేస్తుంది. ఇందులోని బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఇది తెల్లని బట్టలపై మురికిని దూరం చేస్తుంది. ఇందుకోసం ముందు రోజు నిమ్మకాయ రసాన్ని మరకలపై రాసి వేడి నీటిలో నానబెట్టండి. హైడ్రోజన్ పెరాక్సైడ్.. అదే విధంగా, డిటర్జెంట్‌కి హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని కలపండి. తెల్లని బట్టల కాలర్లు, అండర్ ఆర్మ్స్ ప్రాంతాల్లోని మురికిని దూరం చేసేందుకు వాడొచ్చు. ఇలా చేయడం వల్ల చాలా వరకూ మరకలు దూరమవుతాయి.

# ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే....






సమ్మర్‌లో కూరగాయలు, పండ్లు త్వరగా వాడిపోతాయి. అలా కాకుండా ఉండాలంటే వీటిని ఎలా స్టోర్ చేసుకోవాలో తెలుసుకోండి. సాధారణంగా చాలా మంది ఫ్రిజ్‌లో పండ్లు, కూరగాయలు పెడుతుంటారు. ఎందుకంటే ఫ్రిజ్‌లో వీటిని పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కానీ, కొన్నిసార్లు పండ్లు, కూరగాయల్ని ఫ్రిజ్‌లో పెట్టినా పాడవుతుంటాయి. దీనికి కారణాలు ఏంటి. ఎందుకిలా త్వరగా పాడవుతాయి. మరి వీటిని ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.
అన్నింటిని ఒకేదగ్గర వద్దు.. కూరగాయలు, పండ్లలో చాలా ఎంజైమ్స్ ఉంటాయి. వీటిని అన్నింటిని ఒకేదగ్గర పెడుతుంటారు చాలా మంది. దీంతో కొన్ని కూరగా యలు, పండ్లు ఇథలీన్‌ని ఉత్పత్తి చేస్తాయి. దాంతో అవి త్వరగా కుళ్ళిపోతాయి. అటువంటి కూరగాయలు, పండ్లని ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి. క్యాబేజీ.. క్యాబేజీ కూడా తాజాగా ఉండాలంటే స్వచ్ఛమైన గాలి అవసరం. అందుకే, యాపిల్స్, పుచ్చకాయలు, కివీస్ వంటి పండ్లతో వీటిని కలిపి పెట్టొద్దు. ఇవన్నీ కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేసే పండ్లు. కాబట్టి, వీటికి దూరంగా ఉంచి స్టోర్ చేయడం అవసరం.
సోరకాయతో వద్దు.. సోరకాయ, పొట్లకాయ వంటి కూరగాయల్ని యాపిల్, ద్రాక్ష, అంజీర్ వంటి పండ్లతో కలిపి ఒకే దగ్గర స్టోర్ చేయొద్దు. ఎందుకంటే ఇవి కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేస్తాయి. దీంతో త్వరగా పాడవుతాయి.బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీకి ఇథలీన్ పడదు. కాబట్టి.. మీరు దీనిని ఆపిల్, అత్తి, ద్రాక్ష పండ్ల వంటి ఇథలీన్ ఉత్పత్తి చేసే పండ్లతో బ్రకోలీని పెడితే అది త్వరగా పాడవుతుంది. అందుకే వాటిని ఈ పండ్లతో కలిపి పెట్టొద్దు.. ఆకుకూరలతో ఇవి వద్దు.. ఆకు కూరలు తాజాగా ఉండాలంటే వాటిని సెపరేట్‌గా ప్యాక్ చేసి పెట్టాలి. వీటికి దగ్గర్లో పుచ్చకాయ, ద్రాక్ష, యాపిల్స్ వంటి ఇథలీన్ రిలీజ్ చేసే పండ్లతో కలిపి పెట్టొద్దు. దీని వల్ల ఆకుకూరలు త్వరగా పాడవుతాయి. అందుకే వీటికి సెపరేట్‌గా పెట్టండి.

# గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే...

వర్షాలు మొదలయ్యాయి. ఈ సమయంలో చాలా మంది మొక్కలు పెడుతుంటారు. పూ మొక్కలు అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో గులాబీలు ప్రత్యేకం. మరి ఆ చెట్లకి పువ్వులు ఎక్కువగా పూయాలంటే ఏం చేయాలి.
గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే ఇలా చేయండి.. కొంతమంది మొక్కలు పెంచుతారు. అలాంటప్పుడు కొన్ని పొరపాట్లు కూడా ఉంటాయి.
అలానే గులాబీ మొక్కలు పెంచేటప్పుడు కూడా కొన్ని తప్పులు చేస్తుంటారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే మనం కొన్ని విషయాలు పాటించాలి. అప్పుడే అవి ఎక్కువ పూలు పూస్తాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం. కొనేటప్పుడు.. మీరు గులాబీ మొక్కను కొనేటప్పుడు ఆల్రెడీ పూలు ఉంటే వాటిని తీసి వేయండి. అప్పుడే కొమ్మలు మాత్రమే పెరుగుతాయి. గులాబీ మొగ్గలు వస్తాయి. కాబట్టి, కొనేటప్పుడు ఏమైనా పూలు వుంటే తీసేయండి. ఎక్కడ నాటాలి.. గులాబీ మొక్కల్లో చాలా రకాలు ఉన్నాయి. కాబట్టి, మనం ఏది కొంటున్నామో కూడా తెలుసుకోవాలి. గులాబీలను వెలుతురు ఉన్న ప్రదేశంలో పెట్టాలి. రెగ్యులర్‌గా ప్లేసెస్ మార్చొద్దు. తర్వాత దీనికి మంచి కంపోస్ట్ రిచ్ మట్టిని వాడాలి. కనీసం




రెండు అడుగుల లోతులో గులాబీలను నాటండి. మీరు కంపోస్ట్, మట్టిని కలిపి వాడొచ్చు.
నీరు పోయడం.. గులాబీలకు నీరు పోయడం కూడా చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో నీరు సరిగ్గా పట్టాలి. నీరు పోసేటప్పుడు ఆకులపై నీరు పడకుండా చూడాలి.
వేప మిశ్రమం.. గులాబీ మొక్కలు ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో పాటు వేప పొడి కలిపి గులాబీ మొక్కలు నాటాలి. ఇది ఎక్కువగా ఎరువుల దుకాణాల్లో దొరుకుతుంది ఇలా నాటితే పురుగులు పట్టకుండా మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయి. రాలుతున్న పూలు.. ఎప్పటికప్పుడు రాలే పూలను తీసేయాలి. దీని వల్ల కొత్త పూలు వస్తాయి. గులాబీలు వసంతకాలం నుండి చివరి శరదృతువు వరకు వికసిస్తాయి. వాటిని చూసినప్పుడల్లా రాలుతున్న పూలని తీసేయాలి.
పురుగు మందులు.. అదే విధంగా, గులాబీ మొక్కలకి బయట దొరికే పురుగు మందులు బదులు ఇంట్లోనే కొన్ని సహజ క్రిమి సంహారకాలు తయారు చేయొచ్చు. అందుకోసం వేపాకులు తీసుకుని అందులో వెల్లుల్లి తొక్క వేసి మొత్తగా మిక్సీ పట్టి ఈ మిశ్రమాన్ని ఫిల్టర్ చేసి స్ప్రే బాటిల్‌లో వేయాలి. దీనిని స్ప్రే చేస్తుంటే చీడపీడలు, కీటకాలు, చీమలు వదులుతాయి.




# పిల్లల గది ఇలా డిజైన్ చేస్తే..





పిల్లల రూమ్ డిజైన్ చేయడం..
తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. పిల్లలకు నచ్చేలా, వారి ఇష్టాలకు అనుగుణంగా రూమ్ డిజైన్ చెయ్యాలనుకుంటారు. పిల్లల రూమ్ ఎలా డిజైన్ చేయాలో ఈ స్టోరీలో చూద్దాం.
తల్లిదండ్రులకు ఎప్పుడూ ఎగ్జైటింగ్‌గానే ఉంటుంది. పిల్లల గది డిజైన్ చేయడం అంత ఈజీ కాదు. పిల్లలకు ఏమి ఇష్టం, ఆసక్తి, వారి ఆలోచనలను దృష్టిలో ఉంచుకుని వారి గదిని ఆలంకరించాలి. చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని మేల్కొలిపేలా, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేలా వాళ్ల గది డిజైనింగ్ ఉండాలి. పిల్లలకు అదే ప్రపంచం.. ఆ గదిలోనే ఆడతారు, చదువుకుంటారు, నిద్రపోతుంటారు. పిల్లల రూమ్ డిజైన్ చేసేప్పుడు.. గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యమైన విషయాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.
పిల్లలు ఎక్కువగా ముదుర రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. వారి రూమ్‌లో ఒకే గోడకు ముదురు రంగులు వేయించండి. మానసిక శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం చిన్న పిల్లలు ఎరుపు, నీలం, పసుపు రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. ఇవి కాకుండా ఆకుపచ్చ, పర్పుల్ కూడా వారికి నచ్చుతాయి. మొత్తం అంతా ఒకే రంగు కాకుండా గదిలో వేర్వేరు చోట్ల వేర్వేరు రంగులను వేయించండి. ఒక గోడ మీద కార్టూన్‌లు, బొమ్మలు, వాళ్ల ఫేవరెట్ కార్టూన్, కథల్లోని పాత్రలను గోడ మీద వేయించవచ్చు.
కార్టూన్లు, బొమ్మలతో వాల్‌పేపర్లు వస్తున్నాయి. వాటిని గోడమీద అంటించొచ్చు. ప్రయాణాలంటే ఇష్టపడుతున్నా, వారిలో అటువంటి ఆలోచనలు తేవాలన్నా ప్రపంచ పటం వాల్‌పేపర్‌గా ఉంటే బావుంటుంది. స్టార్స్, ట్రైయాగిల్స్, సర్కిల్ లాంటి పిల్లలకు స్పెషల్‌గా ఉంటాయి.
చిన్నారుల కోసం ఫర్నీచర్, మంచం లాంటివి కొనేప్పుడు ఆకారాల్లో, రంగుల్లో ఆకర్షణీయంగా, భిన్నంగా ఉండేట్టు చూడాలి. బెడ్ అందంతో పాటు పిల్లల భద్రత, సౌకర్యాలకు కూడా ప్రాధాన్యమివ్వాలి. పిల్లల పరుపు మరీ గట్టిగా ఉండకుండా చూసుకోవాలి. కొద్దిగా మెత్తగా ఉంటే పిల్లలు ఇష్టపడతారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్నట్లయితే ప్లేస్ అడ్జెస్ట్‌మెంట్ చాలా ముఖ్యం. ఈ పరిస్థితి ఉంటే.. బంక్ బెడ్‌లు, ట్రండల్ పుల్ అవుట్ బెడ్‌లు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించవు. కొన్ని ఫర్నిచర్ ఐటెమ్‌లలో, డ్రాయర్‌లను బంక్ బెడ్ మెట్లలోకి నిర్మించవచ్చు స్టడీ ఎసెన్షియల్‌లను స్టోర్ చేయడానికి వీటిని ఉపయోగించవచ్చు. పిల్లలు చదువుకోవడానికి ఓ మూల టేబులు, చైర్ ఎరేంజ్ చెయ్యాలి. మంచంలోనే చాక్‌బోర్డులను ఏర్పాటు చేసుకోవడం ఇప్పటి పిల్లల గదుల ప్రత్యేకత. పిల్లలు యాక్టివ్‌గా ఉంటారు. వాళ్ల గదిలోనే అటూ ఇటూ తిరుగుతూ ఆడుతూ ఉంటారు. వాళ్ల సేఫ్టీని దృష్టిలో ఉంచుకుని రూమ్ డిజైన్ చేయడం మంచిది. ఫర్నిచర్ స్ట్రాంగ్‌గా, క్వాలిటీగా ఉండేలా చూసుకోవాలి. ఫర్నిచర్ అంచులు గుండ్రంగా ఉండాలి. రాత్రిళ్లు నిద్రపోయే ముందు లైట్స్ ఆఫ్ చేస్తే పిల్లలు కొత్తలో భయపడతారు. చీకట్లో కూడా మెరిసేలా సీలింగ్‌కు మెటాలిక్ రంగులు వేస్తే చీకట్లోనూ భయం లేకుండా నిద్రపోతారు. పిల్లల గదిలో కంటికి శ్రమ కలిగించని ఫ్లోరోసెంట్ బల్బులను వాడాలి.

# ఏసి కచ్చితంగా రిపేర్ చేయించాలి..



ఎండాకాలంలో చాలా మంది ఏసీలు వాడుతుంటారు. వీటిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా మెంటెయిన్ చేయాలి. లేకపోతే దీనిని ఆస్వాదించలేం. కొన్ని ప్రాబ్లమ్స్ వచ్చినప్పుడు వాటిని గుర్తించి రిపేర్ చేస్తే మంచి కూలింగ్ ఫీల్‌ని పొందగలం. అవేంటో ఇప్పుడు చూద్దాం. వేడి గాలి వచ్చినప్పుడు.. చాలా మంది ఏసీలను ఆస్వాదించాలనుకుంటారు వీటిని కొన్న కొత్తలో చల్లగా ఊటీలోనో, కొడైకెనాల్‌లోనో ఉన్నట్లుగా అనిపిస్తుంది. కానీ, రోజులు గడిచేకొద్దీ ఏసీ నుంచి వేడి గాలి వస్తుంటుంది. అలాంటప్పుడు ఏం చేయాలంటే.. ఏసి టెంపరేచర్‌ని రూమ్ టెంపరేచర్ కంటే తక్కువగా సెట్ చేయండి. అయినా వేడి గాలి వస్తుంటే ఓ సారి రిపేర్ చేయించడం మంచిది. గాలి రాకపోతే.. అదే విధంగా కొన్నిసార్లు సరిగ్గా గాలి రాదు. వెంటిలేషన్ లేకపోతే ఇలా జరుగుతుంది. మీ ఏసీ కెపాసిటీ సరిగ్గా లేకపోతేనే ఇలా అవుతుంది. కాబట్టి, ఓ సారి సర్వీసింగ్ చేయించడం మంచిది. దీని వల్ల ఏసి సరిగ్గా పనిచేస్తుంది. దీంతో పాటు కొంతమంది ఏసీలు ఆన్ చేసినప్పుడు ఎక్కువగా సౌండ్ వస్తుంటుంది. అలా రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఓ సారి ఏసీ రిపేర్ చేయించాల్సిందే.. ఎక్కువగా చలిగా అనిపించినప్పుడు.. సాధారణంగా రూమ్ టెంపరేచర్ చల్లగా ఉంచేందుకే ఏసీలను వాడుతుంటారు. వీటికి అనుగుణంగానే ఏసీలు వాడినప్పుడు రూమ్ టెంపరేచర్ చల్లగా అయితే, ఆపరేటింగ్ సిస్టమ్ దానంతట అదే ఆఫ్ అవుతుంది. అలా జరగకుండా రూమ్‌లో ఇంకా చల్లదనం పెరుగుతుంటే కచ్చితంగా దీనిని రిపేర్ చేయించడం మంచిది. నీరు కారడం.. ఇది కూడా ఓ ముఖ్య కారణం. ఏసీ నుంచి నీరు కారడం కరెక్ట్ కాదు. ఇది ఏసి కండిషనింగ్ యూనిట్ ప్రాబ్లమ్, కాబట్టి, ఇలా జరిగినప్పుడు కూడా వెంటనే ఏసిని రిపేర్ చేయించడం బెస్ట్. దుర్వాసన వస్తుంటే.. ఏసీ వాడినప్పుడు వాసన కొద్దిగా తేడా వస్తుందా.. అయితే దీనికి కారణం సిస్టమ్ సరిగ్గా పనిచేయకపోవడం. కాబట్టి, ఈ టైమ్‌లో కూడా వెంటనే రిపేర్ చేయించాలి. రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్.. అదే విధంగా ఏసీ ఆన్ చేసినప్పుడు రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్ ఉండాలి. అంతేకానీ, ఒక్కో చోట ఒక్కో టెంపరేచర్ ఉంటే ఆపరేటింగ్ సిస్టమ్‌లో ప్రాబ్లమ్ ఉన్నట్లే. కాబట్టి, ఆ సమయం లో కచ్చితంగా ఏసి రిపేర్ చేయించాల్సిందే. కరెంట్ బిల్ ఎక్కువగా రావడం.. అదే విధంగా, ఏసి వాడినప్పుడు సాధార ణంగా కరెంట్ బిల్ ఎక్కువగా వస్తుంటుంది.

# మిక్సీలో అల్లం రుబ్బుతున్నారా..





అల్లం, మసాలాలు, కొబ్బరి తురుము, ఇడ్లీ, దోశ పిండి ఇలా ఏవైనా సరే ప్రిపేర్ చేయడానికి మిక్సీని ఎక్కువగా వాడతారు. అన్ని అవసరాలకి అనుగుణంగా మిక్సీలను వాడుతుంటారు. అందులో కూరగాయలు కట్ చేయడం, చపాతీ పిండిని కలిపేందుకు కూడా డిజైన్ చేస్తున్నారు. దీంతో చాలా మంది వీటిని వాడుతూ ఆ విధంగానే తమ పనని ఈజీ చేసుకుంటున్నారు. కానీ, ఇలా చేసేటప్పుడు కొన్నింటిని గమనించాలని చెబుతున్నారు నిపుణులు.
చపాతీ పిండి.. చాలా మంది పిండిని కలిపేందుకు కూడా మిక్సీలను వాడుతుంటారు. దీనికోసం ప్రత్యేకంగా అట్టా నీడర్ ఉంటుంది. అందుకోసం వేసి పిండిని మెత్తగా కలుపుతారు. కానీ, పిండి త్వరగానే కలిసిపోతుంది. కానీ, చేతితో కలిపినట్లుగా ఉండదు. దీనివల్ల చపాతీలు కూడా బాగా రావు. కాబట్టి, చేతితో కలపడం మంచిది.
వేడి వేడి ఫుడ్స్.. వేడి వేడి ఫుడ్స్.. అదే విధంగా కొన్నింటిని ఫ్రై చేసి అవి వేడిగా ఉండగానే మిక్సీలో వేస్తారు చాలా మంది. అలా ఎప్పుడు చేయకూడదు. దీని వల్ల జార్ త్వరగా పాడవుతుంది. అంతేనా, విరిగిపోతుంది కూడా. అలా కాకుండా వాటిని కాస్త గోరువెచ్చగా అయ్యేవరకూ ఉండి ఆ తర్వాత వాటిని మిక్సీ పట్టాలి. అల్లం వెల్లుల్లి.. అల్లం వెల్లుల్లిని చాలా మంది మిక్సీ జార్‌లోనే వేస్తారు. ఇది అందరూ చేసేదేగా ఎందుకు వద్దు అనుకుంటున్నారా.. వీటిని ఎక్కువ పరిమాణంలో చేస్తే త్వరగా అయ్యేందుకు మిక్సీ వాడొచ్చు. అదే తక్కువగా చేస్తే వాటిని చిన్న జార్‌లో వేసే బదులు చిన్న రోలులో వేయాలి. ఎందుకంటే, తక్కువగా వేస్తే అది ఆ బ్లేడ్స్‌లోనే చాలా వరకూ ఇరుక్కుంటుంది. త్వరగా బయటికి రాదు వాసన కూడా వస్తుంది. కాబట్టి, అలాంటి మసాలాలని చేత్తో నూరుకుంటేనే మంచిది. ఫ్రోజెన్.. చాలా మంది ఫ్రోజెన్ ఫుడ్స్ వాడుతుంటారరు. వీటిని అప్పుడే ఫ్రిజ్ నుంచి తీసి మిక్సీలో వేస్తే అది మెత్తగా అవ్వడానికి చాలా టైమ్ తీసుకుంటుంది. దీని వల్ల బ్లేడ్స్ త్వరగా అరిగిపోతాయి. అందుకే అలా చేయొద్దు కూరగాయలు... చాలా మంది కూరగాయల్ని కూడా చాపర్‌లో వేస్తుంటారు. కానీ, అలా వేయకపోవడమే మంచిది. ఇవన్నీ ఒకే పరిమాణంలో ఉండాలని అనుకుంటారు కానీ, అందులో ఏమైనా చిన్న చిన్న బ్యాక్టీరియా, పురుగులు వంటివాటిని గమనించలేం. అదే విధంగా, అన్నింటిని చాపర్‌లోనే వేయకూడదని గుర్తుపెట్టుకోండి.

# అదరగొట్టిన ఎస్బీఐ..
# భారీగా పెరిగిన లాభాలు..

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యూ3 ఫలితాల్ని ప్రకటించింది. నికర లాభం ఏకంగా 84 శాతానికిపైగా పెరిగింది. ఆదాయం కూడా పెరిగింది. అయితే ఇదే సమయంలో ఎస్బీఐ మంచి ఫలితాలు నమోదు చేసినప్పటికీ.. స్టాక్ ధర మాత్రం పడిపోయింది. గత కొద్ది రోజులుగా కూడా ఈ షేర్ ధర పతనమైంది.

దేశంలోని దిగ్గజ కంపెనీలు వరుసగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికం ఫలితాల్ని ప్రకటిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. తొలుత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ కంపెనీలు ఫలితాల్ని వెల్లడించగా.. తర్వాత బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు



కూడా ఫలితాల్ని వెల్లడించాయి. తాజాగా దేశంలోని ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద బ్యాంక్.. ఎస్బీఐ కూడా అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాల్ని విడుదల చేసింది. క్యూ3లో ఈ బ్యాంకు నికర లాభం ఏకంగా 84.32 శాతం పెరిగి రూ. 16,891 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఈ సమయంలో లాభం కేవలం రూ. 9,164 కోట్లుగానే ఉండేది. దీంతో ఈసారి భారీగా పెరిగిందని చెప్పొచ్చు. ఈ లాభం.. అంచనాల్ని మించింది.

ఇక సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ. 41,446 కోట్లుగా వచ్చింది. ఏడాది కిందట ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ. 39,816 కోట్లుగా ఉంది. మరోవైపు టాక్స్ తర్వాత లాభం రూ. 16,891 కోట్లుగా వచ్చింది. ఇక్కడ అంచనాల్ని తప్పినట్లు తెలుస్తోంది. ఇక బ్యాంకు.. ఉద్యోగులపై వెచ్చించే ఖర్చులు 17 శాతం తగ్గి రూ. 16,074 కోట్లకు చేరింది. ఎస్బీఐ డొమెస్టిక్ లోన్స్ 14.06 శాతం మేర పెరిగాయి. ఏడాది కిందటి నుంచి పోలిస్తే ఇలా ఉండగా.. కిందటి త్రైమాసికం అంటే జులై- సెప్టెంబర్ త్రైమాసికం ఫలితాలతో చూస్తే లాభం 8 శాతం తగ్గడం గమనార్హం. ఇక సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 10 శాతం పెరిగి రూ. 1.17 లక్షల కోట్లుగా ఉంది.

ఎస్బీఐ ఈ సమయంలో మంచి ఫలితాలే నమోదు చేసినప్పటికీ.. మరోవైపు స్టాక్ నెగెటివ్‌లో ట్రేడవుతోంది. కిందటి సెషన్లో రూ. 766.05 వద్ద ముగిసిన స్టాక్.. ఇవాళ ఆరంభంలో స్వల్ప లాభాల్లోనే ట్రేడయినప్పటికీ తర్వాత మార్కెట్లు నష్టపోతున్న క్రమంలో.. మరోవైపు ఫలితాల నేపథ్యంలో ఈ స్టాక్ పడిపోతూ వచ్చింది. ప్రస్తుతం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎస్బీఐ షేర్ ధర 1.75 శాతం నష్టంతో రూ. 752.65 వద్ద ఉంది. ఇంట్రాడేలో రూ. 751.05 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఇక స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 912 గా ఉంది. బ్యాంక్ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 6.72 లక్షల కోట్లుగా ఉంది. ఈ బ్యాంక్ స్టాక్.. గత5 రోజులు, నెల, 6 నెలల సమయంలో చూస్తే ప్రతికూల ఫలితాల్నే అందిస్తోంది. ఏడాదిలో మాత్రం 15 శాతం పెరగ్గా.. ఐదేళ్లలో చూస్తే 130 శాతానికిపైగా పుంజుకుంది.



# బడ్జెట్ తర్వాత కూడా..
# సుకన్య వంటి పథకాల్లో పెట్టుబడి పెట్టాలా?

2025: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2025లో ఆదాయపు పన్నులకు సంబంధించి సంచలన నిర్ణయం తీసుకుంది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించింది. దీంతో కొత్త పన్ను విధానంలోకి మారతారు. యూనియన్ బడ్జెట్ 2025లో కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చారు. రూ.12 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించారు. ఈ నిర్ణయం మరింత మంది ట్యాక్స్ పేయర్లు పాత పన్ను విధానం నుంచి కొత్త పన్ను విధానంలోకి మారేందుకు ప్రోత్సహిస్తుంది. అయితే, పాత పన్ను విధానంలో ఉంటే వివిధ పన్ను మినహాయింపులు, డిడక్షన్లు కొత్త విధానంలో ఉండవు. అయినప్పటికీ రూ.12 లక్షల వరకు రిబేట్, స్టాండర్డ్ డిడక్షన్ కల్పించడం గమనార్హం. దీంతో 97 శాతం మంది ట్యాక్స్ పేయర్లు కొత్త విధానంలోకి మారే అవకాశం ఉందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ ఇటీవలే వెల్లడించారు. సాధారణంగా సెక్షన్ 80సీ ద్వారా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి యోజన, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వంటి పెట్టుబడులపై రూ.1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. అలాగే సెక్షన్ 80డీ ద్వారా ఆరోగ్య బీమాపై గరిష్ఠంగా రూ.50 లక్షల మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీసీసీ ద్వారా పెన్షన్ ఫండ్ కంట్రిబ్యూషన్‌పై ట్యాక్స్ డిడక్షన్స్ ఉంటాయి. హెమ్ లోన్ వడ్డీ, హెచ్‌ఆర్‌ఏ మినహాయింపులు వంటివి పాత పన్ను విధానంలో ఉంటాయి. కానీ, కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. చిన్న మొత్తాల పొదుపు పథకాలైన పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఈఎల్ఎస్ఎస్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్న ట్యాక్స్ పేయర్లకు ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పించే పాత పన్ను విధానంలో కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ స్కీమ్స్ అన్నీ సెక్షన్ 80సీ కిందకు వస్తాయి. రూ.1.50 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. 2020లో కొత్త పన్ను విధానం ప్రవేశపెట్టినప్పటి నుంచి చూసుకుంటే పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ, కొత్త విధానంలోకి మారిన వారికి ప్రతి ఏడాది భారీ ఊరట కల్పిస్తున్నారు. పన్ను శ్లాబుల్లో మార్పులు, ట్యాక్స్ మినహాయింపుల పెంపు వంటివి ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో బడ్జెట్ 2025 తర్వాత కూడా చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో పెట్టుబడులు కొనసాగించాలా? వద్దా? అనే విషయంపై చాలా మంది ట్యాక్స్ పేయర్లు ఆయోమయంలో పడ్డారు. చాలా మంది కొత్త పన్ను విధానంలోకి మారిన తర్వాత పెట్టుబడులు పెట్టడం మానేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఆర్థిక నిపుణులు పలు విషయాలు వెల్లడించారు. ట్యాక్స్ సేవింగ్ ప్రయోజనాలు లేనప్పటికీ ఆయా పథకాల్లో పెట్టుబడులు కొనసాగించాలని చెబుతున్నారు. ఈ పొదుపు పథకాలను ఎంచుకోవడం కేవలం పన్ను ఆదా కోసం మాత్రమే ఉండకూడదంటు న్నారు. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ఇప్పటికీ సురక్షితమైన, స్థిరమైన రిటర్నులు అందిస్తాయని గుర్తు చేశారు.

బడ్జెట్ తర్వాత ట్యాక్స్ పేయర్లకు తమ పెట్టుబడి నిర్ణయాలపై మరింత సౌలభ్యం ఏర్పడిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ట్యాక్సే సేవింగ్ పథకాలే కాకుండా ఇతర పొదుపు పథకాలను ఎంచుకునేందుకు అవకాశం లభించిందని, తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడి పథకాలను ఎంచుకోవచ్చంటున్నారు. దీంతో ట్యాక్స్ సేవింగ్ స్కీమ్స్ ఈఎల్ఎస్ఎస్ వంటి మూడేళ్ల లాకిన్ పీరియడ్ లేదా 15 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉన్న పీపీఎఫ్ కాకుండా ఇతర పథకాలనూ ఎంచుకోవచ్చని చెబుతున్నారు. ఏదైనా ట్యాక్స్ బెనిఫిట్స్ కోసమే ఆలోచించకూడదని, ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుడులను కొనసాగించాలంటున్నారు.

## నైపుణ్యం, వికేంద్రీకరణ, వ్యాపార సామర్థ్యాల
# పెంపుపై దృష్టి పెట్టండి

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్
- ఘనంగా మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాన్క్లేవ్ 2025




**హైదరాబాద్ :** నైపుణ్యం, వికేంద్రీకరణ, వ్యాపార సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం (ఐ అండ్ సీ), సమా చార సాంకేతికత (ఐటీ) విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) వృద్ధి కోసం ప్రభుత్వంతో వ్యాపార ప్రముఖులు చర్చించేందుకు హైదరాబాద్‌లోని షెరటన్ హోటల్‌లో మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాన్క్లేవ్ 2025 నిర్వహించారు. ఈ కాన్క్లేవ్ కు అధ్యక్షత వహించిన జయేశ్ మాట్లాడుతూ గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ఆర్థిక వృద్ధికి మూలమ న్నారు. ఇవి మా ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైన వృద్ధి శక్తిగా మారాయన్నారు. ఇటీవల బడ్జెట్‌లో జాతీయ స్థాయిలో దీనిపై ఒక విధానం అమలు చేయను న్నట్లు వెల్లడించామన్నారు. హైదరాబాద్ అన్ని వృద్ధి ప్రమాణాలలో దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. దీనికి గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల సహకారం ఎంతో ఉందని చెప్పారు. వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామ న్నారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన టైర్-2 సిటీల పాలసీ ద్వారా హైదరాబాద్ వెలుపల కంపెనీలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహ కాలు అందిస్తున్నట్టు తెలిపారు. తూర్పు హైదరాబాద్‌లోని మేడ్చల్, దక్షిణ హైదరాబా ద్‌లోని మల్లంపేట ప్రాంతాలను ప్రస్తా విస్తూ..ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిం చారు. వ్యాపార సంస్థలు తమ ఉద్యోగులను ఈ ప్రాంతాల్లో ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మూవ్ ఇన్ సింక్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో దీపేశ్ అగర్వాల్ మాట్లాడుతూ 2030 నాటికి భారతీయ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల మార్కెట్ 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. ఇప్పటికే 30 శాతం పైగా గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ఇతర నగరాల కంటే హైదరాబా ద్‌ను ప్రాధాన్యతగా ఎంచుకున్నాయని తెలిపారు. హ్యూమనైజ్ వ్యవస్థాపకుడు, సీఈవో జగదీష్ మిత్ర మాట్లాడుతూ 2030 నాటికి 2,400 గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనున్నదని తెలిపా రు. ఇప్పటికే గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు ముఖ్యమైన ఇన్నోవేషన్ హబ్‌గా మారింద న్నారు. హ్యూమనైజ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో జగదీష్ మిత్ర, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇండియా సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ శిరీషా ఓరుగంటి మధ్య ఫైర్‌సైడ్ చాట్ జరిగింది. భారతదేశం లోని వ్యాపారా లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజె న్స్ పాత్రపై చర్చించారు. ఈ చర్చలో ఎవర్నార్త్ హెల్త్ సర్వీసెస్ ఇండియా మేనేజిం గ్ డైరెక్టర్ అశోక్ వెంకటాచలం, జీసీసీ సైట్ లీడర్, కెన్వ్యూ సొల్యూషన్స్ ఇండియా జీసీసీ వీపీ, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ పునేయాని, కార్లైన్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రకాశ్ దేవరకొండ, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ వీపీ, మేనేజింగ్ డైరెక్టర్ హరికృష్ణ వర్మ నడింపల్లి, హ్యూమ నైజ్ సహ వ్యవస్థాపకుడు రాజారాయ్ పాల్గొన్నారు.

# పనామా కాలువపై అమెరికాకు రాయితీ అంతా ఉత్తదే..

పనామా కాలువలో ప్రయాణించే అమెరికా నౌకలకు ఆ దేశం ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదని చెబుతూ అగ్రరాజ్యం అమెరికా విదేశాంగ మంత్రి తాజాగా పోస్ట్ పెట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే అదేమీ లేదని.. తాను అమెరికాకు ఎలాంటి రాయితీ కల్పించలేదంటూ తాజాగా పనామా కెనాల్ అథారిటీ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి తమ పరిధిలోకే వస్తాయని.. ఇప్పటి వరకు తాము ఎలాంటి సవరణలు చేయలేదంటూ షాక్ ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అగ్రరాజ్యం అమెరికాకు చెందిన యుద్ధ నౌకలు.. పనామా కాలువపై నుంచి ప్రయాణిస్తే ఎలాంటి ఫీజును తీసుకోమని ఆ దేశం చెప్పిందంటూ యూఎస్ తాజాగా ప్రకటించింది. ముఖ్యంగా అమెరికా రక్షణ మంత్రి హెగ్సే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలుపగా.. ఇదంతా నిజమేనంటూ అమెరికా విదేశాంగ కూడా ధ్రువీకరించింది. కానీ దీనిపై తాజాగా పనామా కెనాల్ అథారిటీ స్పందించింది. అలాంటిదేమీ లేదని.. తామేమీ అమెరికాకు రాయితీ కల్పించలేదని స్పష్టం



చేసింది. ముఖ్యంగా టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి తమ పరిధిలోకే వస్తాయని.. ఇప్పటి వరకు తాము ఎలాంటి సవరణలు చేయలేదంటూ షాక్ ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికా రక్షణ మంత్రి హెగ్సే ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ మరీ.. అమెరికా యుద్ధ నౌకలు పనామా కెనాల్‌పై ప్రయాణిస్తే ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని వివరించింది. ఇందుకు ఆ దేశం కూడా ఒప్పుకుందని వెల్లడించింది. ఇది నిజమేనంటూ అమెరికా విదేశాంగ శాఖ కూడా క్లారిటీ ఇవ్వగా.. అంతా నిజమేనని భావించారు. కానీ తాజాగా ఇదంతా అబద్ధం అని.. పనామా కెనాల్ అథారిటీ తేల్చి చెప్పింది. పనామా అమెరికాతో ఎలాంటి ఒప్పందమూ చేసుకోలేదని వివరించింది.

ముఖ్యంగా పనామా కెనాల్ నిర్వహణ బాధ్యత తమవద్దే ఉంటుందని.. టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివన్ని తమ పరిధిలోకే వస్తాయని వెల్లడించింది. ఇప్పటి వరకు తాము పనామా కాలువకు సంబంధించిన ఎలాంటి సవరణలు చేయలేదని.. ముఖ్యంగా యూఎస్‌కు ఎలాంటి రాయితీ కల్పించలేదని ప్రకటించింది. దీంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు అమెరికా ఇలా ఎందుకు చెప్పిందని ఆలోచిస్తున్నారు.

ప్రపంచ వాణిజ్యానికి ఎంతో కీలకం అయిన ఈ జల మార్గాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ఎన్నో ఏళ్లుగా కలలు కంటుకున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడే ఈ విషయాన్ని తెలిపిన అతడు.. మరోసారి అధికారం చేతిలోకి రావడంతో కలను సాధించుకోవాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం 51 మైళ్లు (82 కిలో మీటర్లు) కల్గిన ఈ పనామా కాలువ అట్లాంటిక్-పసిఫిక్ సముద్రాల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.

అయితే ఈవారంలోనే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో లాటిన్ అమెరిగా దేశాల్లో పర్యటించబోతున్నారు. ఈ సందర్భం గానే కెనాల్‌పై చైనా నియంత్రణల్లో తక్షణమే మార్పులు తీసుకు రావాలని ఒత్తిడి చేయబో తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఆ దేశం చర్యలు తీసుకోకపోతే తామే ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని కూడా అమెరికా భావిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే రూబియో పనామా అధ్యక్షుడు జాస్‌రౌల్‌తో పాటు కాలువ నిర్వాహకుడు రికార్టే వాస్క్వేజ్ మోరేల్స్‌ను కలిశారు.

# అమెరికాలో కోడిగుడ్ల కొరత..

సాధారణంగా కోళ్లను దొంగిలించే వాళ్లను చూస్తూనే ఉంటాం. అయితే ఇప్పుడు అమెరికాలో మాత్రం కోడి గుడ్లను దొంగతనం చేశారు. అది కూడా ఒకటో రెండో గుడ్లు కాదు.. ఏకంగా లక్ష గుడ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. వినడానికి చాలా ఫన్నీగా ఉన్నా.. ఈ ఘటన నిజంగానే జరిగింది. ప్రస్తుతం అమెరికాలో గుడ్ల కొరత అక్కడి వారిని వేధిస్తుండగా.. కొందరు దాన్ని ఆసరాగా చేసుకుని.. లక్ష గుడ్లు చోరీ చేయడం తీవ్ర దుమారానికి కారణం అవుతోంది. అసలు అమెరికాలో గుడ్ల కొరత ఎందుకు వచ్చింది. ఈ దొంగతనం ఎలా జరిగింది అనేది ఈ స్టోరీలో చూద్దాం.

అమెరికాలో ప్రస్తుతం కోడి గుడ్ల కొరత నెలకొంది. కోడి గుడ్లను కొనుగోలు చేసేందుకు అమెరికన్లు భారీగా ఎగబడుతున్నారు. దీంతో కోడి గుడ్ల ధరలు అక్కడ అమాంతం పెరుగుతున్నాయి. అయితే ఉత్పత్తి తక్కువ కావడం.. డిమాండ్ పెరిగిపోవడంతో.. గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు.. బర్డ్ ఫ్లూ కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపో యిందని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే గుడ్లు దొంగతనం జరగడం గమనార్హం. ఏకంగా 1 లక్ష గుడ్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు తాజాగా పోలీసులకు ఫిర్యాదు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కోడి గుడ్ల కొరత నెలకొనగా.. ఇప్పుడు ఏకంగా లక్ష గుడ్లు దొంగతనానికి గురి కావడం సంచలనంగా మారింది.

పెన్సిల్వేనియా రాష్ట్రంలోని గ్రీన్‌క్యాసెల్ నగరంలో ఉన్న పీట్ అండ్ గ్యారీస్ ఆర్గానిక్స్ ఎల్ఎల్‌సీ సంస్థకు చెందిన లక్ష గుడ్లు మాయం అయ్యాయి. రిటైల్ షాపులకు సరఫరా చేసేందుకు గుడ్లను లారీల్లో లోడ్ చేయగా.. ఆ లోడ్ నుంచి దొంగలు కోడి గుడ్లను ఎత్తుకెళ్లినట్లు సదరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. చోరీ అయిన గుడ్ల విలువ 40 వేల డాలర్లు అని.. అయితే ఇది మన భారత కరెన్సీలో దాదాపు రూ.35 లక్షలు ఉంటుందని తెలుస్తోంది.

గత కొన్ని రోజులుగా కోడి గుడ్ల కొరతతో అమెరికావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2 ఏళ్ల క్రితం డజన్ గుడ్లు ఒక డాలర్ అంటే మన కరెన్సీలో రూ.84 ఉండగా.. ఇప్పుడు అదే డజన్ గుడ్ల ధర ఏకంగా 7 డాలర్లు అంటే దాదాపు రూ.590 పలుకుతున్నట్లు చెబుతున్నారు. గుడ్ల కొరత కారణంగానే ఒక్కసారిగా వీటి ధర అమాంతం పెరిగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక అమెరికాలో గుడ్ల ధరలు పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి బర్డ్‌ఫ్లూ కాగా.. మరొకటి పెరుగుతున్న గుడ్ల డిమాండ్. గత 2 ఏళ్లుగా అమెరికాలోని పలు ప్రాంతాల్లో క్రమంగా బర్డ్‌ఫ్లూ ప్రభావం



పెరుగుతూ వస్తోంది. గత దశాబ్దకాలంలోనే ఇంతటి భారీ స్థాయిలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాపించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గతనెలలో లూసియానా రాష్ట్రంలో మనుషులకు కూడా ఈ ప్రాణాంత కరమైన స్థాయిలో ఉండే బర్డ్‌ఫ్లూ వేరియంట్‌ను డాక్టర్లు కనుగొన్నారు. దీంతో పౌల్ట్రీ యజమానులు.. ప్రతి నెలా లక్షలాది కోళ్లను చంపేస్తున్నారు. 2022లో బర్డ్ ఫ్లూ కారణంగా 10.4 కోట్ల గుడ్లు పెట్టే కోళ్లు చనిపోయాయని యునైటెడ్ ఎగ్ ప్రొడ్యూసర్స్ వెల్లడించింది. ఇవే కాకుండా గతేడాది అక్టోబర్‌లో 29 లక్షల కోళ్లు చనిపోయాయని.. ఈ కారణంగానే అమెరికాలో ప్రస్తుతం గుడ్ల కొరత ఏర్పడినట్లు చెబుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ తినలేని అమెరికన్లు మొత్తం.. ఇప్పుడు గుడ్లు తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని.. అందుకే గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. గుడ్ల ధరలు భారీగా పెరుగుతుం డటంతో గుడ్లతో తయారు చేసే వంటకాల ధరలను కూడా రెస్టారెంట్లు, హోటళ్లు పెంచుతున్నాయి.

**అమెరికాలో ప్రస్తుతం కోడి గుడ్ల కొరత నెలకొంది. కోడి గుడ్లను కొనుగోలు చేసేందుకు అమెరికన్లు భారీగా ఎగబడుతున్నారు. దీంతో కోడి గుడ్ల ధరలు అక్కడ అమాంతం పెరుగుతున్నాయి. అయితే ఉత్పత్తి తక్కువ కావడం.. డిమాండ్ పెరిగిపోవడంతో.. గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు.. బర్డ్ ఫ్లూ కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని అధికారులు వెల్లడించారు.**

# భారత్‌తో సంప్రదింపులపై పాక్ ప్రధాని సన్నాయినొక్కులు!

దేశ విభజన జరిగిన 75 ఏళ్లు గడిచినా.. ఇప్పటికీ కశ్మీర్ అంశం రగులుతూనే ఉంది. దాయాది పాకిస్థాన్.. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించి భారత్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ కుట్రలను భారత్ తిప్పికొడుతూ.. పాక్ తీరును ఐరాస వంటి వేదికలపై ఎండగడుతోంది. కశ్మీర్‌లో అంగుళం భూమి కూడా వదులుకోబోమని... అది ఎప్పటికీ మా దేశంలో అంతర్భాగమేనని భారత్ కుండ బద్దలు కొడుతోంది. ఇందులో ఇతరుల జోక్యాన్ని సహించబోమని చెప్పింది. దాయాది పాకిస్థాన్ మరోసారి శాంతి మంత్రం వల్లించింది. కశ్మీర్ అంశం సహా భారత్‌తో ఉన్న అన్ని సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకో వాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. కానీ, ఐక్యరాజ్యసమితిలో చేసిన వాగ్దానాలను భారత్ నెరవేర్చి, చర్చలకు ముందుకు రావాలంటూ పసన్నాయి నొక్కులు నొక్కింది. 'కశ్మీర్ సంఘీభావ దినం' సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఆగస్టు 5 నాటి ఆలోచన నుంచి భారత్ బయటకు రావాలని కోరారు. అయితే, ఐరాసకు చేసిన వాగ్దానం నేరవేర్చుతూ కశ్మీర్ సహా అన్ని సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని షెహబాజ్ అన్నారు. పరోక్షంగా భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దును పాక్ ప్రధాని ప్రస్తావించడం గమనార్హం. 'కశ్మీరీలకు స్వయం నిర్ణయాధికార హక్కు లభించే వరకు పాకిస్థాన్ దృఢమైన నైతిక, దౌత్య, రాజకీయ మద్దతును అందిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు, 'కశ్మీర్ సమస్యకు ఏకైక పరిష్కారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం ప్రకారం స్వయం నిర్ణయాధికార హక్కు మాత్రమే' అని కూడా ఆయన తెలిపారు.

# రెండు పౌర విమానాలు ఢీ..

అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలు ప్రజలు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రమాదం జరిగింది. సియాటెల్-టకోమా విమానాశ్రయంలో రెండు పౌర విమానాలు ఢీకొనగా.. అదృష్ట వశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టమూ సంభవించలేదు. కాకపోతే ఇందుకు సంబంధించిన వీడియో మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతుంది. అలాగే ప్రమాద సమయంలో రెండు విమానాల్లోనే పెద్ద ఎత్తున ప్రయాణికులు ఉండగా.. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈమధ్య కాలంలో అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు పౌర విమానాలు ఢీకొన్నాయి. విమానాశ్రయంలోనే ఈ ప్రమాదం సంభవించగా.. ఆ సమయంలో రెండు విమానాల్లోనూ పెద్ద ఎత్తునే ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది. అమెరికా వాషింగ్టన్‌లోని సియాటెల్ నగరంలో తాజాగా మరో విమాన ప్రమాదం జరిగింది. సియాటెల్-టకోమా అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం రోజు ఉదయం 10.17 గంటల సమయంలో డెల్టా ఎయిర్ లైన్స్, జపాన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానాలు ప్రమాద వశాత్తు ఢీకొన్నాయి. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 విమానం 142 మంది ప్రయాణికులతో సియాటెల్ నుంచి మెక్సికోలోని ప్యూర్టో వర్లర్టాకు వెళ్లాల్సి ఉండగా రన్‌వేపై సిద్ధంగా ఉంది.

అదే సమయంలో జపాన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం 172 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బందితో జపాన్‌లోని నరిటా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వచ్చి సియాటెల్‌లో ల్యాండ్ అయింది. ఈక్రమంలోనే టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న డెల్టా ఎయిర్ లైన్స్ విమానం తోక భాగాన్ని జపాన్ విమానం రెక్కలతో ఢీకొట్టింది. ప్రమాద విషయం గుర్తించిన రెండు విమానాల్లోని సిబ్బంది వెంటనే.. సదరు విమానాల నుంచి ప్రయాణికులను కిందకు దింపేశారు. అదృష్టవశాత్తు ఎలాంటి ఘోర ప్రమాదమూ జరగలేదు.

# ఆన్‌లైన్‌లో బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ..?

తెలంగాణ: రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు ఫీజుల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఒక్కో కాలేజీలో ఒక్కో రకమైన ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ప్రతీ కాలేజీలో 70 శాతం సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తే.. మిగిలిన 30 శాతం సీట్లు మేనేజ్ మెంట్ కోటా ద్వారా భర్తీ చేస్తారు. ఇదే ప్రతీ కాలేజీకి వరంగా మారుతుంది. బీటెక్ లో సీఎస్‌ఈ గ్రూపునకు సంబంధించి ఒక్కో సీటుకు రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల మధ్య ఫీజులను వసూలు చేస్తున్నారు.



157 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, వాటిలో దాదాపు లక్ష సీట్లు ఉన్నాయి. వీటిలో 30 శాతం సీట్లను యాజమాన్య కోటా కింద భర్తీ చేస్తారు. ఈ కోటాలోనే నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్‌ఆర్‌ఐ) కోటా ద్వారా కూడా ప్రవేశాలు కల్పిస్తారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఫీజుల విషయంలో అనియంత్రితంగా వ్యవహరిస్తున్నాయి. కళాశాలల యాజమాన్యాలు ఒక్కో రకమైన ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయి. ప్రతి కళాశాలలో 70 శాతం సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తుండగా. మిగిలిన 30 శాతం సీట్లను యాజమాన్య కోటా ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇదే కళాశాలలకు వరంగా మారుతోంది. విద్యార్థుల ఎంసెట్ ర్యాంక్, మార్కులతో సంబంధం లేకుండా.. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని యాజమాన్యాలు దోపిడీకి పాల్పడుతున్నాయి. బీటెక్ లో సీఎస్‌ఈ గ్రూపునకు సంబంధించి ఒక్కో సీటుకు రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అంత చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

గత కొన్ని రోజులుగా ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో యాజమా న్య కోటా సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ఎక్కువ డబ్బు చెల్లిస్తే వారికే యాజమాన్య సీట్లను కళాశాలలు అమ్ముకుంటున్నాయి. ఈ అక్రమాల కు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నత విద్యా అధికారులు సిద్ధంగా ఉన్నప్పటి కీ.. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో వెనక్కి తగ్గారు. త్వరలోనే బీటెక్ ప్రవేశాల ప్రక్రి య ప్రారం భం కానుండటంతో దీనిపై ప్రభుత్వం వెంటనే స్పష్ట త ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 157 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, వాటిలో దాదాపు లక్ష సీట్లు ఉన్నాయి. వీటిలో 30 శాతం సీట్లను యాజమాన్య కోటా కింద భర్తీ చేస్తారు. ఈ కోటాలోనే నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్‌ఆర్‌ఐ) కోటా ద్వారా కూడా ప్రవేశాలు కల్పిస్తారు. అయితే.. ఎంసెట్ ద్వారా భర్తీ చేసే సీట్లన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా రిజర్వేషన్లకు అనుగుణంగా భర్తీ చేస్తున్నారు. కానీ, యాజమాన్య కోటా (బి కేటగిరి) సీట్లను మాత్రం యాజమాన్యాలే భర్తీ చేసుకునేలా ప్రభుత్వం అనుమతులు ఇస్తోంది. బి కేటగిరి సీట్లను ఎంసెట్ ర్యాంకు, జెఈఈ ర్యాంకు, ఇంటర్ మార్కుల ఆధారంగా భర్తీ చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ దాదాపు ఏ కళాశాల కూడా ఈ విధానాన్ని అమలు చేయడం లేదు.

ప్రతీ గ్రూపుకు ఒక్కో రకమైన ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గత కొన్ని సంవత్సరాలుగా తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే.. గత ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై తల్లిదండ్రులు, విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో యాజమాన్య కోటా.. ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీని ప్రభుత్వమే చేపట్టాలని తల్లిదండ్రులు.. విద్యార్థి సంఘాల నుంచి భారీగా డిమాండ్లు , వినతులు వస్తున్నాయి. ఈ డిమాండ్లకు అనుగుణంగా గత ఏడాది ఉన్నత విద్యా మండలి అధికారులు బి కేటగిరి సీట్లను కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఎంబిబిఎస్ తరహాలో బీటెక్ సీట్లను కూడా ఆన్‌లైన్‌లో భర్తీ చేస్తామని స్పష్టంగా పేర్కొన్నారు.

అయితే.. అప్పటి ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. ఈ ఏడాది బీటెక్ లో కొత్త ఫీజులు అమలులోకి రాబోతున్నాయి. ఇప్పటికే ఎంసెట్(ఏప్‌సెట్) ఫలితాలు విడుదలైనా, ఇంకా ప్రవేశాల నోటిఫికేషన్ రాలేదు. ఈ సమయంలోనే బి కేటగిరి సీట్ల భర్తీ విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ఆన్‌లైన్‌లో యాజమాన్య సీట్లను భర్తీ చేస్తే కళాశాలల అక్రమ దందాకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుందని వారు భావిస్తున్నారు.

## గొడవ మధ్యలో దూరిందని..

హైదరాబాద్: చాలామంది చిన్న చిన్న విషయాలకే సహనం కోల్పోయి, ఏం చేస్తున్నామనే ఆలోచన లేకుండా ప్రవర్తిస్తున్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాంతం బాధపెట్టేలా ఉంటున్నాయి. చిన్న విషయాలకే విచక్షణ కోల్పోయి వైలెంట్‌గా తయారవుతున్నారు. తాజాగా.. హైదరాబాద్ మధురా నగర్‌లో చిట్టీ డబ్బుల విషయంలో తలెత్తిన గొడవ చిలికి చిలికి గాలి వానగా తయారైంది. గొడవ మధ్యలో దూరిందని ఓ వ్యక్తి మహిళ చూపుడు వేలు కొరికేశాడు.

ఘటన వివరాల్లోకి వెళితే.. మధురానగర్ జవహర్‌నగర్‌కు చెందిన మమత అనే మహిళ గత మూడేళ్లుగా మధురానగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటోంది. ఆ ఇంటి యజమానురాలు సుజిత చిట్టీలు వేస్తుండగా.. మమత కూడా ఆమె వద్ద చిట్టీలు వేసింది. ఈ చిట్టీల లావాదేవీల్లో సుజిత మమతకు రూ 30 వేలు చెల్లించాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం మమత ఆ ఇల్లు ఖాళీ చేసి తన స్నేహితురాలు సుప్రిను ఆ ఇంట్లోనే అద్దెకు దించింది. అయితే, సుప్రియ హఠాత్తుగా ఇంటిని ఖాళీ చేయడంతో ఇంటి అద్దె విషయంలో సుజితకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో.. తమకు రావాల్సిన చిట్టీ డబ్బుల గురించి మమత, ఆమె భర్త హేమంత్ సుజితను కలిసి అడిగారు. అప్పుడు సుజిత.. సుప్రియ అద్దె చెల్లించకుండా వెళ్లిపోయిందని ఆ అద్దె డబ్బును వారే చెల్లించాలని పట్టుబట్టింది. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది, అది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ గొడవ జరుగుతుండగా.. సుజిత తల్లి లత మధ్యలో కలగజేసుకుంది. ఆ సమయంలో ఆగ్రహంతో ఉన్న హేమంత్ ఆమె కుడిచేతి చూపుడు వేలును కొరికేశాడు.

ఆ దెబ్బకు లత చూపుడు వేలు పూర్తిగా తెగి కింద పడిపోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు ఆ వేలును తిరిగి అతికించ లేమని తేల్చి చెప్పారు.

ఈ సంఘటనతో తీవ్రంగా కలత చెందిన లత మానసిక వేదనకు గురైంది. సుజిత ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు హేమంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. మరీ ఇంత వైలెంట్‌గా ఉన్నారేంట్రా అని స్థానికులు చర్చించుకున్నారు. క్షణికావేశంలో చేసిన తప్పుకు ఓ మహిళ చూపుడు వేలు కోల్పోవటమే కాకుండా.. వ్యక్తి జైలు పాలయ్యాడు.

## కూకట్‌పల్లికి హైడ్రా.. 79 మందికి న్యాయం..

హైదరాబాద్: కూకట్‌పల్లి పరిధిలోని హైదర్ నగర్‌లో డైమండ్ ఎస్టేట్ లేఅవుట్‌లోని భూమిని అక్రమార్కుల నుండి విడిపించేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ఈ విషయంలో హైడ్రా చేసిన కృషి ఎంతోమందికి ఊరటనిచ్చింది. డైమండ్ ఎస్టేట్ లేఅవుట్ తొమ్మిది ఎకరాల 27 గుంటల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ స్థలాన్ని 2000 సంవత్సరంలో 79 మంది మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేశారు. అయితే శివ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మరికొందరితో కలిసి ఈ స్థలాన్ని ఆక్రమించాడు. ప్లాట్ల యజమానులు తమ స్థలంలోకి రాకుండా నిరోధించడానికి దుర్గాప్రసాద్ హైకోర్టు నుండి స్టే ఆర్డర్ తెచ్చుకున్నాడు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించగా.. 2024 సెప్టెంబర్‌లో కోర్టు ప్లాట్ల యజమానులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయినప్పటికీ ఆక్రమణదారులు స్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో బాధితులు హైడ్రా సంస్థకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణదారుల నిర్మాణాలను తొలగించారు. ఎట్టకేలకు తమ స్థలాన్ని దక్కించుకున్న ప్లాట్ల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తూ హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రూపాయి ఖర్చులేని ఆలోచన..

### గత ప్రభుత్వం చేయలేకపోయింది

తెలంగాణ: మున్నేరు వాగు వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసింది. దీని ద్వారా 10 నీటిని మళ్లించి, 2.54 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించవచ్చు. పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాలకు లబ్ధి చేకూరుతుంది. దీని వల్ల సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ ప్రాంతానికి సాగునీరు అందుతుంది. త్వరలోనే ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వృథాగా సముద్రంలోకి వెళ్తున్న మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడానికి మున్నేరు -పాలేరు లింక్ కెనాల్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసింది. ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98 ని విడుదల చేయడం జరిగింది. రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన ఈ రాష్ట్రాన్ని పదేళ్లు ఏలిన గత ప్రభుత్వానికి రాలేదని రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల వృథాగా పోతున్న వరద నీటిలో సుమారు 10 వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించవచ్చు. దీనివల్ల ఈ రిజర్వాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ



జరుగుతుంది. ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని మంత్రి అన్నారు. కెనాల్ కోసం నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఈ మేరకు మంత్రి పొంగులేటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీని ద్వారా సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వస్తున్న వరద నీరు వృధా కాకుండా ఒడిసి పట్టాలనే సంకల్పంతో మున్నేరు నుంచి పాలేరుకు లింక్ కెనాల్ ను మంజూరు చేయించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి పాలేరు నియోజకవర్గ రైతాంగానికి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

నేడు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పాలేరు, మధిర, ఖమ్మం, కోదాడ నియోజకవర్గాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన పలు శుభకార్యాలకు హాజరయ్యారు. స్థానిక నాయకులు, ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అలాగే.. ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి తన సానుభూతిని తెలియజేశారు. కాచిరాజుగూడెంలో పలువురు వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరగా.. మంత్రి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనలో భాగంగా, ఆయన ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్షలు జరిపారు. అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. పేదలు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.



## మెట్రోస్టేషన్ కూడా వదలని ప్రబుద్ధులు..

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో స్టేషన్‌లో టీవీ మాయం కావడంతో కలకలం రేగింది. పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో జరిగిన ఈ ఘటన భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. సీసీటీవీ కెమెరాలు ఉన్నా చోరీ జరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో లిఫ్టుల్లో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. ప్రయాణికుల ప్రవర్తనపై నిఘా పెట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటన మెట్రో స్టేషన్లలో భద్రతా వ్యవస్థలపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. అసలేం జరిగిందో తెలుసుకోవాలంటే పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే!

హైదరాబాద్‌లోని అత్యంత భద్రతా వ్యవస్థలు కలిగిన, నిరంతరం సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉండే మెట్రో స్టేషన్‌లో ఒక టీవీ మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో ఒక గదిలో అమర్చిన 55 అంగుళాల స్క్రైవర్త్ టెలివిజన్ కనిపించకుండా పోయినట్లు ఉద్యోగులు ఆలస్యంగా గుర్తించారు. దీంతో శనివారం రాత్రి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు అంతర్గత విచారణ జరిపి స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా.. గత నెల 20వ తేదీ ఉదయం 5.52 గంటలకు టెక్నీషియన్లు అశోక్, ఉమామహేశ్వర్ ఆ గదిలోకి వెళ్లి టీవీని తీసుకెళ్లినట్లు తేలింది. దీని ఆధారంగా స్టేషన్ అధికారి డి. కృపాదర్శిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన మెట్రో స్టేషన్లలో భద్రతా వ్యవస్థలపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. నిరంతర నిఘా ఉన్నప్పటికీ.. ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుండి ఇలాంటి ఘటనలు జరిగాయా అనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. అయితే.. మెట్రో స్టేషన్లలో ప్రయాణికుల ప్రవర్తనకు సంబంధించిన కొన్ని ఆందోళనలు వెలుగులోకి వచ్చాయి.

ఇటీవల.. మెట్రో స్టేషన్లలోని లిఫ్టుల్లో కొందరు ప్రేమికులు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. లిఫ్టులు ప్రైవేట్ ప్రదేశాలు కానప్పటికీ, కొందరు ప్రయాణికులు ఇతరులు ఏమనుకుంటారో అనే ఆలోచన లేకుండా అసభ్యకరమైన పనులు చేస్తున్నారు. ఇది ఇతర ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇటువంటి సంఘటనల వల్ల ఇబ్బంది పడుతున్నారు.

మెట్రో అధికారులు ప్రయాణికుల ప్రవర్తనపై నిఘా ఉంచడానికి.. ఇలాంటి సంఘటనలను నివారించడానికి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. అదనపు భద్రతా సిబ్బందిని నియమించడం, తరచుగా హెచ్చరికలు జారీ చేయడం.. అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలి. మెట్రో రైలు వ్యవస్థ నగర రవాణాలో కీలకమైన భాగం. ప్రయాణికుల భద్రత.. సౌకర్యాన్ని నిర్ధారించడం అధికారుల బాధ్యత. ప్రయాణికులు కూడా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి.. మెట్రో ఆవరణలో మర్యాద పాటించాలి.

## భర్తకు తెలియకుండా ఇదేం పనమ్మా..

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోతరాజు వీరయ్య అనే రైతు ఎడ్లను అమ్మగా వచ్చిన రూ.1.50 లక్షలను ధాన్యం బస్తాలో దాచాడు. ఈ విషయం తెలియని ఆయన భార్య ఆ బస్తాను అమ్మేసింది. డబ్బులు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బు దాచుకునే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. సురక్షి తమైన ప్రదేశాల్లో దాచుకోవాలని, బ్యాంకుల్లో వేసుకోవడం మంచిదని పోలీసులు తెలిపారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండలం గాంధీనగర్‌లో ఒక విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. పోతరాజు వీరయ్య అనే రైతు తన ఎడ్లను అమ్మగా వచ్చిన రూ.1.50 లక్షల రూపాయలను ఇంట్లోని ధాన్యం బస్తాలో దాచాడు. అయితే.. ఈ విషయం అతడు ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. తనకు అవసరం అయిన సమయంలో వాటిని తీసుకుందాం అనుకున్నాడు.

కానీ అంతలోనే ఊహించని ఘటన జరిగింది. ఆ డబ్బులు తెలియని ఆయన భార్య, అదే ధాన్యం బస్తాను ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారికి అమ్మేసింది. పొలం పని ముగించుకుని ఇంటికి వచ్చిన వీరయ్యకు ధాన్యం బస్తా కనిపించకపోవడంతో కంగారుపడ్డాడు. భార్యను అడగగా అసలు విషయం తెలిసింది. వెంటనే ఆ వ్యాపారి కోసం గ్రామం లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### డబ్బు దాచుకోవడానికి మార్గాలు..

ఈ సంఘటన డబ్బు దాచుకునే విషయంలో ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తుంది. సాధారణంగా ప్రజలు తమ డబ్బును ఇంట్లో వివిధ ప్రదేశాల్లో దాస్తుంటారు. చాలామంది తమ డబ్బును బీరువాల్లో లేదా సొరుగుల్లో దాస్తారు. ఇది సురక్షితమైన పద్ధతి అయినప్పటికీ.. దొంగల బారిన పడే అవకాశం ఉంది. కొంతమంది డబ్బును పరుపులు లేదా దిండ్లలో దాస్తారు. ఇది కూడా సురక్షితమైన పద్ధతి కానప్పటికీ, చాలామంది ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. దేవుడి గదిలో డబ్బు దాచడం కూడా ఒక సాధారణ పద్ధతి. అయితే ఇవన్నీ దొంగలకు వెంటనే తెలిసిపోతాయని.. బియ్యం బస్తాలో దాస్తే వారికి దొంగలకు కనపడకుండా ఉండొచ్చనే విధంగా జాగ్రత్త పడ్డాడు. చివరకు ఆ డబ్బులు ఎవరికో చేరిపోయాయి. ప్రజలు డబ్బు దాచుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సురక్షితమైన ప్రదేశాలను ఎంచుకోవాలి . బ్యాంకు ఖాతాలు, ఇతర ఆర్థిక సాధనాలను ఉపయోగిం చడం కూడా డబ్బును సురక్షితంగా ఉంచడానికి మంచి మార్గం.



## హైదరాబాద్ సిటీ అంతటా.. ఫారెన్ రేంజ్‌లో..

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో చిన్న వర్షం వచ్చినా.. ఈదురుగాలులు వచ్చినా కరెంట్ పోతుంది. లేకపోతే పెద్ద ప్రమాదం వస్తుందన్న కారణంగా అధికారులు ఈ విద్యుత్ సరఫరాను ఆపేస్తారు. ఇలా పదే పదే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దే ప్రయత్నాల్లో భాగంగా.. విద్యుత్ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టింది.

భూగర్భ కేబుల్స్ ద్వారా విద్యుత్ అంతరాయాలను నివారించడంతో పాటు.. విద్యుత్ నష్టాలు, దొంగతనాలను అరికట్టడం.. ప్రకృతి వైపరీత్యాల నుంచి విద్యుత్ వ్యవస్థను రక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. చార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో అధికంగా విద్యుత్ లోడ్ కారణంగానే షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానంతో వీటన్నింటికి చెక్ పెట్టొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మొదట హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో పూర్తిస్థాయి భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఈ ప్రాజెక్ట్ మేడ్చల్ జిల్లా నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవస్థ ఏర్పాటుకు కిలోమీటరుకు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో 1,280 కిలోమీటర్ల మేర 33 కెవి భూగర్భ కేబుల్స్ ఉండగా.. దీనిని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. భూగర్భ విద్యుత్ వ్యవస్థను విజయవంతంగా అమలు చేసిన విదేశీ నగరాల విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ ప్రాజెక్ట్ నిర్వహణను విద్యుత్ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకు అప్పగించాలని యోచిస్తున్నారు. ఈ వ్యవస్థ ద్వారా హైదరాబాద్‌ను విద్యుత్ సమస్యలు లేని.. అత్యాధునిక నగరంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ప్రతీ ఏడాది నగరంలో విద్యుత్ డిమాండ్ అధికంగా పెరుగుతోంది. రానున్న రోజుల్లో ఇది మరింత ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డేటా సెంటర్లు, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రాంతీయ రింగ్ రోడ్డు పరిధిలోని రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు అవసరమైన విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. భవిష్యత్తులో నిర్మించబోయే నగరంలో(ఫ్యూచర్ సిటీలో) విద్యుత్ టవర్లు, స్తంభాలు లేకుండా భూగర్భంలోనే విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే.. నగరంలోని సచివాలయం, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్క్ వంటి కీలక ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా.. ఓఆర్‌ఆర్ వెంబడి సౌర విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నారు.

## రాజీవ్ యువ వికాసం స్కీం.. డిప్యూటీ సీఎం కీలక ప్రకటన



తెలంగాణ: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల యువతకు ఈ పథకం ద్వారా ఆర్థికంగా చేయూతనివ్వనుంది. రాష్ట్రంలోని యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందించడం, నిరుద్యోగ సమస్యను తగ్గించడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతను ఆర్థికంగా అభివృద్ధి పరచటం వంటి లక్ష్యాలతో ఈ పథకాన్ని తీసుకొచ్చారు.

80 శాతం వరకు సబ్సిడీతో రూ.50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు మంజూరు చేయనున్నారు. ఈ పథకానికి ఇప్పటికే యువత నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 14 అప్లికేషన్ ప్రాసెస్ ముగియగా.. లక్షల్లో అప్లయ్ చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జరుగుతోంది. మండల స్థాయి కమిటీలు అర్హులను ఎంపిక చేసి జిల్లా స్థాయి కమిటీలకు జాబితాను అందజేస్తాయి. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువతకు శుభవార్త అందించారు.

అచ్చంపేటలో జరిగిన 'ఇందిరా సౌర గిరి జల వికాస' పథకం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. రుణాల మంజూరు ప్రక్రియపై కీలక ప్రకనట చేశారు. రాజీవ్ యువ వికాస పథకానికి జూన్ 2న రూ.1000 కోట్ల నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షమని, ఇందిరమ్మ రాజ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజీవ్ యువ వికాసం పథకం తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఒక గొప్ప అవకాశమనే చెప్పాలి. ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందడం ద్వారా యువకులు తమ స్వంత వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా స్థిరపడవచ్చు. ఇది రాష్ట్రంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే కాకుండా, ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది.



# ప్రేమలు బ్యూటీకి క్రేజీ ఆఫర్

సూర్య, వెంకీ అట్లూరి కాంబోలో సినిమా ఫిక్స్ అయిందన్న సంగతి తెలిసిందే. రెట్రో టైంలోనే అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఇక ఇప్పుడు సైలెంట్‌గా పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మమితా బైజు, మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ పాల్గొన్నారు. ఇక ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే స్టార్ట్ కానుంది. ఇక ఈ మూవీని నాగవంశీ నిర్మిస్తున్నాడు.

సూర్య, వెంకీ అట్లూరి మూవీ పూజా కార్యక్రమాలు సోమవారం నాడు ఘనంగా జరిగాయి. రెట్రో మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ ప్రాజెక్ట్ గురించి లీక్ చేశారు. స్టేజ్ మీద సూర్య, వెంకీ అట్లూరి, నాగవంశీ ముందు హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ మూవీ కోసం నాగవంశీ రెట్రో తెలుగు హక్కుల్ని తీసుకున్నాడట. కానీ రెట్రో వల్ల నాగవంశీకి చాలానే నష్టం వాటిల్లిందని సమాచారం. ఆ మొత్తాన్ని ఇందులో కవర్ చేసేలానే ఉన్నాడు నాగవంశీ.


సూర్య 46 పూజా కార్యక్రమాల్లో హీరోయిన్ మమితా బైజు, మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ మెరిశారు. ప్రేమలు తరువాత మమితకు మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఆల్రెడీ విజయ్‌తో జన నాయగన్ చేస్తోంది. ఇప్పుడు సూర్యతో మూవీని ఓకే చేసుకుంది. ఇక తెలుగులోనూ ఈ క్రేజీ బ్యూటీకి మరిన్ని ఆఫర్లు వస్తున్నట్టుగా కనిపిస్తోంది.

రీసెంట్‌గానే ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ మూవీలో వింత లుక్‌లో మమిత కనిపించిన సంగతి తెలిసిందే. వెంకీ అట్లూరితో వాతి (సార్), లక్కీ భాస్కర్ వంటి బ్లాక్ బస్టర్ల తరువాత మళ్లీ మూడో ప్రాజెక్ట్ చేస్తున్నాను అని జీవీ ప్రకాష్ ట్వీట్ వేశాడు. ఇక సూర్య మూవీకి సంగీతాన్ని అందించబోతోన్నాను అంటూ జీవీ ప్రకాష్ మురిసిపోయాడు. ప్రస్తుతం వెంకీ అట్లూరి మంచి ఫాంలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే వెంకీ అట్లూరి తెలుగు హీరోలతో ఎందుకు సినిమాలు చేయడం లేదు? ప్రతీ సారి పక్క భాషలకు చెందిన హీరోలతోనే సినిమాలు చేస్తున్నాడు? అని అంతా అనుకుంటున్నారు.

వాతి (సార్) సినిమా అటు తమిళం, ఇటు తెలుగులోనూ బ్లాక్ బస్టర్ హిట్ అయింది. లక్కీ భాస్కర్ అయితే తెలుగులో మంచి విజయాన్ని నమోదు చేసింది. కానీ ఇతర భాషల్లో అంతగా క్లిక్ కాలేదనిపిస్తుంది. మరి ఇప్పుడు సూర్యతో చేస్తున్న ఈ మూవీ ద్విభాష చిత్రమని సమాచారం. దీన్ని వెంకీ అట్లూరి ఎలా హ్యాండిల్ చేస్తాడో చూడాలి. ఇక ఇందులో మమిత కారెక్టర్ ఎలా ఉంటుందో చూడాలి. అసలే ఆమెకు యూత్‌లో మంచి క్రేజ్, ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే.



# విజయ్ దేవరకొండ వదులుకున్న సూపర్‌హిట్ సినిమాలేవో తెలుసా?



టాలెంట్‌తో పాటు అదృష్టం కూడా సినీ పరిశ్రమలో కీలకం. కొన్నాళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తోన్న విజయ్ దేవరకొండ గతంలో కొన్ని సూపర్ హిట్ సినిమాలు వదులుకున్నాడు. 'భీష్మ', 'ఇస్మార్ట్ శంకర్', 'ఉప్పెన', 'ఆర్ఎక్స్ 100' వంటి హిట్ సినిమాల్లో మొదట ఆయన్నే అనుకోగా కొన్ని కారణాల వల్ల చేయలేదు. తర్వాత ఈ ప్రాజెక్ట్స్ ఇతర హీరోల చేతికి వెళ్లి బ్లాక్‌బస్టర్లు అయ్యాయి. 'భీష్మ'లో నితిన్, 'ఇస్మార్ట్ శంకర్'లో రామ్, 'ఉప్పెన'లో వైష్ణవ్ తేజ్, 'ఆర్ఎక్స్ 100'లో కార్తికేయ నటించి సూపర్‌హిట్లు అందుకున్నారు. సినీ పరిశ్రమలో రాణించాలంటే టాలెంట్‌తో పాటు అదృష్టమూ కలిసి రావాలంటారు పెద్దలు. అలా కొందరు తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. మరికొందరికి మాత్రం ఎన్ని సినిమాలు చేసినా హిట్టు మొహమే చూడటమే కష్టంగా మారిపోతుంటుంది. అయితే కొందరు తారలు బిజీ షెడ్యూల్ కారణంగానో, లేక స్క్రిప్ట్ నచ్చకో రిజెక్ట్ చేసిన సినిమాలు వేరే వాళ్లు చేసి హిట్టు కొట్టిన సందర్భాలు కోకొల్లలు.

అలా యూత్‌లో ఎంతో క్రేజ్ తెచ్చుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కూడా చాలా సినిమాలు వదులుకున్నాడు. అయితే అవన్నీ మంచి హిట్ సాధించడం విశేషం. వెంకీ కుడుముల డైరెక్షన్లో నితిన్, రష్మిక మందానా జంటగా తెరకెక్కిన చిత్రం 'భీష్మ. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ మూవీ నితిన్ కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్లతో ఒకటిగా నిలిచింది. ఆర్గానిక్ ఫార్మింగ్ నేపథ్యంలో సాగే ఈ కథని వెంకీ కుడుముల ముందుగా విజయ్‌కి చెబితే.. ఏవో కారణాలు చెప్పి రిజెక్ట్ చేశాడట. దీంతో వెంకీ ఈ కథని నితిన్‌కి చెప్పడం ఆయన వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ఈ మూవీ రిజల్ట్ చూశాక దాన్ని వదులుకున్నందుకు విజయ్ దేవరకొండ కచ్చితంగా బాధపడే ఉంటాడు.

విజయ్ దేవరకొండ, పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో ఎన్నో అంచనాలతో వచ్చిన 'లైగర్' మూవీ డిజాస్టర్ అయిన సంగతి తెలిసిందే. అయితే దానికంటే ముందే వీరి కాంబో సెట్ కావాల్సి ఉన్నా కొన్ని కారణాలతో వెనక్కి వెళ్లిపోయింది. రామ్ పోతినేని, పూరీ కాంబినేషన్లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' ఎంత హిట్ అయిందో అందరికీ తెలుసు. అయితే ఈ కథని ముందుగా విజయ్ దేవరకొండకి వినిపిస్తే ఏవేవో అనుమానాలు వ్యక్తం చేస్తూ చేయనని చెప్పాడట. దీంతో ఆ కథ రామ్ దగ్గరికి వెళ్లడం, ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడం జరిగిపోయాయి.

మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా, సానా బుచ్చిబాబు డైరెక్షన్లో వచ్చిన 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ టాక్‌తో యూత్‌ని ఎంతగానో ఆకట్టుకుంది. డీఎస్పీ మ్యూజిక్ ఈ మూవీని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లింది. అయితే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే బుచ్చిబాబు... విజయ్ దేవరకొండని దృష్టిలో పెట్టుకుని ఈ కథ రాసుకున్నాడట. అయితే తనకు డైరెక్టర్‌గా ఛాన్స్ వచ్చేసరికి విజయ్ రేంజ్ మారిపోవడంతో ఆ కథ నప్పదని అనుకున్నాడట. ఆ తర్వాత సుకుమార్ ద్వారా మెగా ఫ్యామిలీని సంప్రదించి వైష్ణవ్ తేజ్‌తో సినిమా తీసి సూపర్‌హిట్ కొట్టాడు.



# 'కబాలి' నటితో విశాల్ పెళ్లి..?

కోలీవుడ్ హీరో విశాల్ పెళ్లిపై చాలాకాలంగా ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. గతంలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో ఆయన ప్రేమ వ్యవహారం నడుపుతున్నారని, ఇద్దరూ పెళ్లి పీటలెక్కబోతున్నారని వార్తలు వచ్చేవి. ఆ తర్వాత అవి నిజం కావని తేలిపోయింది. వరలక్ష్మి గతేడాది తన స్నేహితుడు, వ్యాపారవేత్త అయిన నికోలయ్ సచ్‌దేవ్‌ని వివాహం చేసుకుంది. ఆ తర్వాత విశాల్ పలువురు హీరోయిన్లతో ప్రేమాయణం నడుపుతున్నాడని పుకార్లు వచ్చినా ఏదీ నిర్ధారణ కాలేదు. తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో నటించిన అభిరామిని ఆయన పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్‌మీడియాలో ప్రచారం జరిగేది. అయితే గత నెలలో సన్నీ వర్మ అనే వ్యక్తితో ఆమె ఏడడుగులు వేయడంతో ఆ ప్రచారానికి తెరపడింది.

47 ఏళ్ల విశాల్ ఇటీవలే 'మదగజరాజా'తో హిట్టు కొట్టిన సంగతి తెలిసిందే. నడిగర్ సంఘానికి భవనం నిర్మించేవరకు తాను పెళ్లి చేసుకోనని గతంలో శపథం చేసిన విశాల్ ఆ ప్రయత్నంలోనే ఇన్నాళ్లూ తలమునకలై ఉన్నాయి. ఆ భవన నిర్మాణం చివరి దశకు చేరుకోవడంతో ఇటీవలే పెళ్లి గురించి మీడియా ప్రతినిధులు ఆయన్ని అడిగారు. దీనికి విశాల్ స్పందిస్తూ.. 'నా జీవిత భాగస్వామి అయ్యే వ్యక్తిని కనుగొన్నా.. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తా' అని తెలిపారు. దీంతో విశాల్ ప్రేమ వివాహానికి సిద్ధమయ్యారని అందరూ అనుకున్నారు. అయితే తాజాగా జరుగుతోన్న ప్రచారం ప్రకారం. ఆయన 'కబాలి' నటి సాయి ధన్సికతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వీళ్లిద్దరు పెళ్లి చేసుకోవడం ఖాయమని కోలీవుడ్ కోడై కూస్తోంది.

సాయి ధన్సికతో విశాల్ వివాహం వార్త నిజమేనని తన సన్నిహితులు కూడా చెబుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ వార్తలకు మరింత ఆజ్యం పోసేలా ఓ ఘటన జరగబోతోంది. సాయి ధన్సిక నటించిన 'యోగి దా' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ త్వరలో జరగబోతుండగా.. దానికి విశాల్ చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నారట. ఆ ఈవెంటలోనే విశాల్ తన పెళ్లిపై ప్రకటన చేసే అవకాశం ఉందంటున్నారు. సాయి ధన్సిక, విశాల్ కొంతకాలంగా గాఢంగా ప్రేమించుకుంటున్నారని, త్వరలోనే వీరు ఎంగేజ్‌మెంట్ చేసుకుని నాలుగు నెలల్లో వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై అటు సాయి ధన్సిక... ఇటు విశాల్ క్లారిటీ ఇస్తే గానీ ఈ వార్తలకు ఫుల్‌స్టాప్ పడేలా లేదు.

'కబాలి' చిత్రంలో రజినీకాంత్ కూతురిగా నటించి మెప్పించిన సాయి ధన్సిక తమిళంలో బిజీ అయిపోయింది. దీంతో ఆమె కొంతకాలంగా తీరిక లేకుండా సినిమాలు చేస్తోంది. తెలుగులో షికారు, అంతిమ తీర్పు, దక్షిణ సినిమాల్లో నటించింది.



# పూనమ్‌కి ఆరోగ్య సమస్యలు..

పూనమ్ కౌర్ ప్రస్తుతం ఏపీ సీఎంతో భేటీ అయిన ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఇక చంద్రబాబు నాయుడికి ప్రత్యేకంగా ఓ బహుమతిని కూడా ఇచ్చింది పూనమ్ కౌర్. ఈ క్రమంలో పూనమ్ కౌర్ తన హెల్త్ గురించి చెప్పింది. ప్రస్తుతం తన ఆరోగ్యం ఏమీ బాగా లేదని వివరించింది. తనకు వచ్చిన సమస్య గురించి చెప్పింది. ఫుడ్ ఎలర్జీ వచ్చిందని పూనమ్ చెప్పుకొచ్చింది.

పూనమ్ కౌర్ ఎప్పుడు ఏ ట్వీట్ వేసినా కూడా కాంట్రవర్సీకి దారి తీస్తూనే ఉంటుంది. ఆమె ట్వీట్‌తో చర్చలకు దారి తీస్తుంటుంది. ఇక తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుని ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో కలిసింది పూనమ్ కౌర్. ఏపీ సీఎంకు ఓ అరుదైన బహుమతిని అందించింది. ఇక ఈ ఈవెంట్‌లో పాల్గొనేకంటే ముందు ఆమె ఆరోగ్యం ఏమీ బాగా లేదంట. ఫుడ్ ఎలర్జీతో బాధపడుతూ ఉందట. అంతే కాకుండా ఫైబ్రోమయాల్జియా అనే వ్యాధితో ఇబ్బందుల్ని ఎదుర్కొంటోందట.

పూనమ్ కౌర్ ఈ మేరకు తన ఆరోగ్య సమస్యల్ని చెబుతూ వేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. ఇక ఆమెకు నెటిజన్లు రకరకాల సలహాలు ఇస్తున్నారు. మంచి ఆర్గానిక్ ఫుడ్ తినండి.. హిల్ స్టేషన్స్‌కు వెళ్లండి.. ధ్యానం చేయండి.. మెంటల్ హెల్త్‌ని కేర్ చేయండి అంటూ ఇలా సలహాలు ఇస్తూ ట్వీట్లు వేస్తున్నారు. ఇక తన ఆరోగ్య సమస్యల వల్లే అలా శరీరం ఉబ్బుతోందని, అందుకే అలా కనిపిస్తున్నాను అంటూ పూనమ్ చెప్పుకొచ్చింది.

ఇక పూనమ్ కౌర్ ఈ మధ్య పవన్ కళ్యాణ్ మీద పరోక్షంగా ట్వీట్లు వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఆపరేషన్ సింధూర్ టైంలో, పవన్ కళ్యాణ్ ప్రెస్ మీట్ల మీద పూనమ్ కౌర్ పరోక్షంగా స్పందించినట్టు అనిపించింది. పూనమ్ కౌర్ ఎప్పుడూ త్రివిక్రమ్, పవన్ కళ్యాణ్‌ల మీద సైటర్లు వేసినట్టుగా ట్వీట్లు వదులుతుంటుంది. గురూజీ అంటూ, త్రివిక్రమ్ అంటూ పేర్లు పెడుతూనే ట్వీట్లు వేస్తుంటోంది పూనమ్ కౌర్.

ఇక పూనమ్ కౌర్ ఇష్యూ ఏంటి? అసలు తనకు వచ్చిన నష్టం, కలిగిన బాధ ఏంటన్నది ఇంత వరకు ఎవ్వరికీ క్లియర్‌గా తెలీదు. 'మా'లో కంప్లైంట్ ఇస్తే చర్యలు తీసుకుంటామని టీం చెబుతుంది. ఆల్రెడీ ఫిర్యాదు చేశానని పూనమ్ కౌర్ అంటుంది. కేవలం ట్విట్టర్‌లో ఫేమస్ అవ్వడానికి ట్వీట్లు వేస్తే సరిపోదని శివ బాలాజీ, నిర్మాత చిట్టి బాబు వంటి వారు కౌంటర్లు వేస్తుంటారు. మరి అసలు పూనమ్ కౌర్ ఎందుకు ఇలా చేస్తుంటుంది? తన సమస్య ఏంటి? అన్నది ఎప్పుడు చెబుతుందో చూడాలి.

# 'వీరమల్లు'కు కొత్త తలనొప్పి...



ఒకేపని పూర్తి కాకుండా వాయిదాలు పడుతూ ఉంటే దండయాత్ర చేస్తున్నారంటూ సెటైర్లు వేయడం కామనే. ఇప్పుడు 'హరిహర వీరమల్లు' సినిమాకి సంబంధించి దండయాత్ర అనే పదం కరెక్ట్ సరిపోతుందేమో. ఎందుకంటే ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ సినిమా 2022లోనే విడుదల కావాల్సి ఉంది. కర్ణుడి చావుకి వంద కారణాలు అన్నట్లు 'వీరమల్లు' రిలీజ్ కాకుండా ఎన్నో కారణాలు, సందర్భాలు అలా క్రియేట్ అవుతూ వస్తున్నాయి. అన్నీ సక్రమంగా జరిగితే 202లో సంక్రాంతికే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేది. అయితే సినిమా ఆలస్యం కావడం, డైరెక్టర్ క్రిష్ తప్పుకోవడం, దర్శకత్వ బాధ్యతలు జ్యోతికృష్ణ చేపట్టడం పరిణామాలు యూనిట్‌ని డిస్టర్బ్ చేశాయి.

ఈ తర్వాత పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో బిజీ కావడంతో ఈ మూవీ వాయిదాలు పడుతూ వస్తోంది. అలా 2022, ఏప్రిల్ 29, 2022 అక్టోబర్ 5, 2023, మార్చి 30, అదే ఏడాది దసరాకి రిలీజ్ చేస్తామని చెప్పినా సాధ్యం కాలేదు. ఆ తర్వాత 2024లో సమ్మర్‌కి రిలీజ్ అని హడావుడి చేశారు. 2025 సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పినా వాయిదా పడింది. ఆ తర్వాత మార్చి 28 అని ప్రచారం చేసినా మళ్లీ వాయిదా పడి చివరికి మే 9న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. చివరికి ఆ డేట్ కూడా వాయిదా పడుతూ జూన్ 12న రిలీజ్‌కు సిద్ధమయ్యాడు వీరమల్లు. అయితే తాజాగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే జూన్ 12న అయినా 'హరిహర వీరమల్లు' రిలీజ్ అవుతుందా అని ఇండస్ట్రీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. థియేటర్ల సమస్యలపై ఆదివారం ఫిల్మ్ ఛాంబర్లో నిర్మాతలతో జరిగిన సమావేశంలో ఎగ్జిబిటర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. అద్దె ప్రాతిపదికన థియేటర్లను నడిపించలేమని.. పర్సెంటేజీ రూపంలో అయితేనే రన్ చేస్తామంటూ థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చారు. జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు మూసివేస్తామని ప్రకటించారు. ఈ పరిణామాలతో 'హరిహర వీరమల్లు' వాయిదా పడొచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ నెల 30న 'భైరవం' సినిమా రిలీజ్ అవుతుండగా.. జూన్‌లో థగ్‌లైఫ్, కన్నప్ప, కుబేర వంటి భారీ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి.

# నటుడు మాస్టర్ భరత్ ఇంట్లో విషాదం



మాస్టర్ భరత్‌కు మాతృ వియోగం కలిగింది. ఆదివారం రాత్రి మాస్టర్ భరత్ తల్లి కమల హాసిని కన్నుమూశారు. గుండెపోటుతో ఆమె మరణించినట్టుగా తెలుస్తోంది. ఇక నేడు చెన్నైలోనే అంత్య క్రియలు జరగనున్నాయి. భరత్‌కు టాలీవుడ్ ప్రముఖులు సంతాపాన్ని ప్రకటిస్తున్నారు. ప్రస్తుతం భరత్ తన తల్లిని కోల్పోయిన దు:ఖంలో ఉన్నాడని ఆ ఫోటోలు చూస్తేనే తెలుస్తోంది. టాలీవుడ్ నటుడు, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్‌కు మాతృ వియోగం కలిగింది. భరత్ తల్లి కమలా హాసిని గుండెపోటుతో ఆదివారం (మే 18) నాడు కన్నుమూశారు. చెన్నైలో రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం భరత్ ఇంటికి సెలెబ్రిటీలు, బంధు మిత్రులు అంతా చేరుకుంటున్నారు. అమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, భరత్‌కు ఆ దేవుడు మరింత శక్తిని ప్రసాదించాలని అంతా కోరుకుంటున్నారు. ప్రస్తుతం భరత్ చెన్నైలోనే ఉంటున్న సంగతి తెలిసిందే.

మాస్టర్ భరత్ కామెడీ సీన్లు, భరత్ యాక్టింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. చిన్నప్పుడు భరత్ చేసిన కామెడీ సీన్లు ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోతాయి. ఇక పెద్దయ్యాక భరత్ కామెడీ చేసినా జనాలు అంతగా రిసీవ్ చేసుకోలేదు. అందుకే పెద్దయ్యాక భరత్‌కు అంతగా ఆఫర్లు రావడం లేదు. చిన్నప్పుడు బూరెల్లాంటి బుగ్గలతో ఉండటం, ఆ కామెడీ అందరికీ నచ్చడంతో ఆఫర్లు వచ్చాయి. ఇప్పుడు భరత్ తల్లిని పోగొట్టుకుని పుట్టెడు దు:ఖంలో ఉన్నాడు. మరి దీని నుంచి త్వరగా బయటకు వచ్చి మళ్లీ షూటింగ్స్ అంటూ బిజీ అవుతాడేమో చూడాలి. భరత్‌కు టాలీవుడ్ మేకర్లు మళ్లీ ఒకప్పటిలా మంచి కామెడీ రోల్స్ రాయాలని అంతా కోరుకుంటున్నారు.

# ఘట్టమనేని వారసుడిని హీరోగా లాంచ్ చేస్తున్న Rx100 డైరెక్టర్



ఘట్టమనేని కుటుంబం నుండి మరో వారసుడు టాలీవుడ్‌లోకి అడుగు పెట్టడానికి సిద్ధమవుతున్నాడు. దివంగత కృష్ణ మనవడు, రమేష్ బాబు తనయుడు జయ కృష్ణ త్వరలోనే హీరోగా పరిచయం కానున్నాడని సమాచారం. మహేష్ బాబు సపోర్టుతో.. Rx 100 ఫేమ్ అజయ్ భూపతి ఈ బాధ్యతను తీసుకున్నట్లు తెలుస్తోంది. వైజయంతి మూవీస్ బ్యానర్ ద్వారా అశ్విని దత్ లాంచ్ చేయనున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ వార్తతో సూపర్ స్టార్ అభిమానులు ఎంతో ఆనందంగా ఉన్నారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో ఘట్టమనేని కుటుంబానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. దివంగత నటశేఖర కృష్ణ ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి తన సేవలు అందించారు. ఆయన బాటలో ఇద్దరు కుమారులు మహేష్ బాబు, రమేష్ బాబు తెరంగేట్రం చేసారు. రెండో కూతురు మంజులతో పాటుగా చిన్నల్లుడు సుధీర్ బాబు కూడా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చారు. ఇప్పటికే కృష్ణ మనవడు అశోక్ గల్లా హీరోగా లాంచ్ అయ్యాడు. మహేష్ తనయుడు గౌతమ్ చైల్డ్ ఆర్టిస్టుగా పరిచయమయ్యాడు. ఈ క్రమంలో ఇప్పుడు ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో హీరో తెలుగు తెరకు పరిచయం కాబోతున్నాడు.

కృష్ణ పెద్ద కుమారుడు రమేష్ బాబు తనయుడు జయ కృష్ణ టాలీవుడ్ లో హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే చదువు పూర్తి చేసుకుని, సినిమాల మీద ఆసక్తితో నటనలో శిక్షణ తీసుకున్నాడు. ఆ మధ్య ఓ ఫోటో షూట్ కూడా చేసాడు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,